# శివుని ఆజ్ఞ



సర్వ స్వామ్యములు: శ్రీసాయి మాస్టర్ సేవా ట్రస్ట్
కాపీలు : 2000
మూల్యము : రూ|| 10/-

ఈ పుస్తక ముద్రణకు సహాయ సహకారాలు అందించిన
శ్రీ పెసల సుబ్బరామయ్య గారికి మరియు
పి. వెంకటేశ్వర రావు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

కాపీల కొరకు:
శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్టు
గొలగమూడి పోస్ట్, వయా సర్వేపల్లి,
నెల్లూరు జిల్లా, ఆం.ప్ర - 524 321.

# ముందు మాట

దేవుడొక్కడే. రూపాలు అనేకం. ఈ దేవుడు చేశాడా? ఆ దేవుడు చేశాడా? అనే మాటలు అర్థ రహితాలు. శివుని ఆజ్ఞ లేక చీమైనా కుట్టదు అనే మాట అక్షర సత్యం. కొన్ని విషయాలలో మన ప్రార్థనల కంటే ముందే దైవం ఆ సన్నివేశాన్ని కూర్చిపెట్టి ఉంటారు. దైవం ఉన్నాడని, ప్రార్థించిన వెంటనే సహాయమందిస్తారనే విషయాన్ని ఆ క్రింది సంఘటనలు నిరూపిస్తున్నాయి.

పి.వి.ర్.కె ప్రసాద్ రావుగారి అనుభవాలన్ని 'నా హం కర్తా హరిః కర్తా' అనే గ్రంథములో పొందుపరిచారు. ఎమెస్కో బుక్స్ వారు పబ్లిష్ చేశారు. ఎమెస్కో బుక్స్, ఏలూరు రోడ్, విజయవాడ-2 అడ్రస్సుకు వ్రాసి పూర్తి గ్రంథము తెప్పించుకొనవచ్చును. దైవ సహాయానికి నిదర్శనంగా ఈ చిన్న పుస్తకం ప్రచురించడమైనది. పాఠకులు చదివి ఆనందించగలరు.

పె. సుబ్బరామయ్య

# ‘నాహం కర్తా, హరిః కర్తా’

‘స్వాతి’ వార పత్రికలో ‘సర్వ సంభవామ్’ శీర్షికన ప్రచురితమైన నా వింత అనుభవాలు చదివిన పాఠకులు అనేకమంది నాకు నేరుగాను ‘స్వాతి’ ద్వారాను రాసిన లేఖల్లో నేను తిరుమల-తిరుపతి దేవస్థానాల ఏగ్జిక్యూటివ్ ఆఫీసర్గా వుండగా అమల్లోకి వచ్చిన అనేక పథకాలకి, విధానాలకి - నాకు గొప్పదనాన్ని ఆపాదిస్తూ వచ్చారు.

నిజానికి, ఇది భక్తులకీ ఉపయోగపడుతుంది అని గాని, దేవస్థానాలకి మంచిదని గాని భావించి నేను చేసాను అనుకుంటున్న ప్రతీపనికి ‘నాహంకర్తా, హరిః కర్తా’ (నేను కాదు కర్తన్ని, చేసేది చేయించేది శ్రీ హరి మాత్రమే) అని మనస్ఫూర్తిగా విశ్వసించి చేసాను. సత్కారాలు వెతుక్కుంటూ వచ్చినా, చీత్కారాలు ముంచెత్తుకొచ్చినా, అన్నీ శ్రీనివాసుడి ప్రసాదమే అని నమ్మాను. ఇప్పటికీ అలాగే నమ్ముతున్నాను. మొదట నా ఈ అనుభవాలనీ ప్రచురించటానికి ‘స్వాతి’ వారు నిర్ణయించినప్పుడు నేను సూచించిన శీర్షిక సహితం ‘నాహంకర్తా, హరిః కర్తా’.

నా అనుభవాలతో నా విశ్వాసాన్ని పాఠకులమీద రుద్దకూడదన్న ఉద్దేశ్యంతోనే జరిగిన సంఘటనలన్ని యధాతథంగా కాగితం మీద పెట్టే ప్రయత్నం చేసాను. కొన్ని సందర్భాలలో అద్భుతంగాను, కొన్ని చోట్ల విచిత్రంగాను, మరికొన్ని సార్లు నమ్మశక్యం కానట్లుగాను కనిపించే నా ఈ అనుభవాల్ని తార్కిక దృష్టితో విశ్లేషించినా, ఆస్తికులు ఆధ్యాత్మిక దృష్టితో చూసినా, అనేక సందేహాలు ఉదయించక మానవు.

భగవంతుడు ఉన్నాడా? ఉంటే ఎలా వుంటాడు? నువు చూసావా అని ప్రశ్నించే హేతువాదులకీ, ఒక మంచి పని చేయాలను కున్నపుడు భగవంతున్ని పట్ల ఎలాంటి విశ్వాసం నుంచి, ఎంత చిత్తశుద్ధితో పని చేస్తే మానవ ప్రయత్నాలకు దైవబలం తోడవుతుంది అని తెలుసుకోవాలనుకునే జిజ్ఞాసువులకి - నా ఈ వింత అనుభవాలలో సమాధానం ఎంత వరకు దొరుకుతుందో చెప్పలేను. కాని, అనుభవాలు పెరిగిన కొద్ది నాలో 'నాహంకర్తా, హరిః కర్తా' అన్న విశ్వాసం మాత్రము ఇనుమిక్కిలిగా పెరిగిందని, పెరుగుతూనే ఉందని చెప్పగలను.

మంచి చెడుల విచక్షణ జ్ఞానంతో కూడిన జీవిత పరమార్ధం తెలుసుకునేలా నడిపిస్తూ వచ్చిన నా స్వరూపోద్దారక గురువు శ్రీ సత్య ప్రమోద తీర్ధస్వామీజి, వారి ఉతరాధికారి శ్రీ సత్యాత్మ తీర్ధ స్వామిజీల మార్గ దర్శకత్వం, ‘సమాజములో పదిమంది జీవితాల్లో వెలుగు నింపడానికే నువు ఐ.ఎ.ఎస్ లో చేరాలనుకుంటున్నాను’ అన్న మా నాన్న గారు పత్రి కృష్ణారావుగారి ఆకాంక్ష, నియమ బద్ధమైన అధ్యాత్మిక జీవన మార్గంలో నేను నడవడానికి నా సహధర్మచారిణి గోపిక నిర్వహించిన పాత్ర నా ఈ అనుభవాలలో నిభిడీ కృతమై ఉన్న జీవిత సత్యాన్ని అన్వేషించే ప్రేరణ కలిగించాయి.

అందుకే, నేను ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్లో చేరిన తొలి సంవత్సరాలలో నన్ను తెలిసున్న వాళ్ళకి ఇవాల్టి నా జీవన శైలి విచిత్రంగాను, నమశక్యం కానిది గానూ కనిపిస్తుంది. ఈ పరివర్ధనానికి దర్పణం నా ఈ అనుభవాల సంకలణం.

నా వింత అనుభావాలలో అధిక భాగం తిరుమల తిరుపతి దేవస్థానాలలో నేను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా పని చేసిన కాలానికి సంబందించినవీ, ఆ పోస్టింగ్ కారణంగా చోటుచేసుకున్నవి, నేను టి.టి.డి. నుంచి బదిలీ అయి 21సం||లు గడుస్తోంది. మరి ఈ అనుభవాల్ని ఇప్పుడే ఎందుకు రాయాలనిపించింది - అని ఏవరికైనా అనిపించవచ్చు. దానికి సమాధానం: ‘నాహంకర్తా, హరిః కర్తా’

పి.వి.ఆర్.కె. ప్రసాద్.

# మోకాలుకీ కొండకీ ఏం సంబంధం?

శ్రీనివాసుడ్ని చూడాలని తిరుమల కొండ ఎక్కితే, మోకాళ్ళు నొప్పి పెట్టడం సహజం. కాని, నా విషయంలో జరిగింది వేరు. మేం - 'తిరుమలకు ఎందుకు వెళ్ళాలి?' అనుకున్నప్పుడే, మోకాలు నొప్పి అనే చేదు అనుభవాన్ని చవిచూడాల్సి వచ్చింది!!

★★★

పశ్చిమ గోదావరి జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ ట్రెయినింగ్ తరువాత భువనగిరి సబ్ కలెక్టర్గా ప్రారంభమైన సర్వీసులో ఖమ్మం జిల్లాకలెక్టరుగా మూడేళ్ళు పనిచేయడంతో జిల్లాల్లో నా పోస్టింగ్స్ ఇంచుమించు పూర్తయ్యాయి. 1977లో ఖమ్మం నుంచి బదిలీ చేస్తూ నన్ను ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల సంస్థ మేనేజింగ్ డైరెక్టరుగా ప్రభుత్వం నియమించింది. ఈ సంస్థ కార్యాలయం హైదరాబాద్లో ఉంది.

ఇంక ఇక్కడితో జిల్లాల్లో పోస్టింగ్లు పూర్తయినట్లే కనుక హైద్రాబాద్లో పిల్లల అడ్మిషన్లు చూసుకొని, సొంత ఇంట్లో స్థిరపడే ప్రయత్నంలో వుండగా, ఒకరోజు హడావుడిగా చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుండి నాకు ఫోన్ వచ్చింది. అప్పట్లో శ్రీ ఐ. జె. నాయుడు ఛీఫ్ సెక్రటరీ. తీరా వెళ్ళాక విషయమేమిటయ్యా అంటే - నేను మూటా ముల్లే సర్దుకుని, మళ్ళీ జిల్లాల్లోకి వెళ్ళాలి. కాకపోతే ఈసారి నేను తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా వెళ్ళాలని ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారు సూచించారు.

ఇలాంటి పోస్టుల విషయంలో ముఖ్యమంత్రులు స్వయంగా ఎంపిక చేసుకోవటం అప్పుడే కొత్తగా ఆరంభమైన విధానం. అదికూడా అంత సులువుగా జరగలేదు. ఛీఫ్ సెక్రటరీ ఎంపిక చేసి ఇచ్చిన కొంతమంది ఐఏఎస్ అధికారుల జాబితాలోంచి ముఖ్యమంత్రి తనకిష్టమైన కొద్దిమందిని మళ్ళీ ఎంపిక చేసుకున్నారు. అందులోంచి నాకు ప్రథమావకాశం ఇచ్చారు. ఛీఫ్ సెక్రటరీ చెప్పటమయితే, "ఆధ్యాత్మిక సంబంధమైన సంస్థలలో పనిచేయాలంటే వాటి ఉనికిపట్ల పరిపూర్ణమైన విశ్వాసం వుండాలి. అలాగే, అక్కడ పనిచేయటానికి ఆసక్తికూడా వుండాలి. ఈ ప్రాతిపదిక పైన ముఖ్యమంత్రి నీ పేరు ఎంపిక చేశారు. కనుక నీకిష్టమైతేనే పోస్టింగ్ ఆర్డర్స్ వేయటం జరుగుతుంది."

నాకు - అప్పటికప్పుడు ఎటూ చెప్పలేని స్థితి. "ఇప్పుడిప్పుడే హైద్రాబాద్లో సెటిల్ అవుతున్నాను. మళ్ళీ హైద్రాబాద్ వదిలిపోవాలా?" అన్న అసంతృప్తి. అలాగని గట్టిగా "నాకు ఆసక్తి లేదు" అని చెప్పేద్దామంటే, "స్వామి వారి నుండి పిలుపువస్తే తిరస్కరించిన వాళ్ళమవుతున్నామా?" అన్న అనుమానం. ఆ సమయంలో ఒక మిత్రుడు నాకు గుర్తు చేశాడు - 1973లో పశ్చిమగోదావరి కలెక్టరుగా వున్న ఒక ఐఏఎస్

అధికారిని ప్రభుత్వం టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా నియమిస్తూ ఆర్డర్సు వేస్తే, స్థానిక రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఆయన అక్కడే మరికొంతకాలం కొనసాగాలని కోరుకోవడం, ఫలితంగా ఆ ఆర్డర్సు రద్దుకావటం జరిగింది. అలా జరిగిన రెండు మూడు వారాల్లోనే ఆయన కస్టమ్స్, ఎసిబి, ఇన్ కంటాక్స్ దాడులకు గురికావటం - సస్పెండ్ అవటం కూడా జరిగింది!!!

ఇలాంటి సందిగ్ధస్థితిలో - ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా భార్యతో కూడా సంప్రదించాలని భావించాను. అందుకే నా నిర్ణయం ఏమిటో చెప్పటానికి రెండురోజులు వ్యవధి కావాలని చీఫ్ సెక్రటరీని నేను కోరటం, ఆయన "సరే" అనడం జరిగిపోయింది.

ఇంటికొచ్చాక భార్య గోపికతో చర్చించాను. అప్పటికే దాదాపు పదేళ్ళపాటు పోస్టింగ్స్ అటూ ఇటూ తిరుగుతూ వున్నాం. కూతురు మాధవి స్కూలు చదువు ఆరంభమై, అప్పటికి మూడు వేర్వేరుచోట్ల స్కూళ్ళలో చేరాల్సివచ్చింది. మళ్ళీ అమ్మాయి చదువుకి భంగం కలుగుతుంది. ఏం చేయాలి? ... చాలా తర్జన భర్జనలు జరిగాయి. వెళ్తానని చెప్పటానికా పూర్తిగా మనసు రావటం లేదు. అలాగని "నాకిష్టం లేదు" అని చీఫ్ సెక్రటరీకి చెప్పలేను. మేమిద్దరం కలిసి ఆలోచించుకుని, "ఈ విషయాన్ని ప్రభుత్వానికే వదిలేస్తున్నాం." - అని చెప్పాలని నిర్ణయించుకున్నాం. ఈ సమస్యకి ఇది తెలివైన పరిష్కారం అని నేను భావించాను. అలాగే చీఫ్ సెక్రటరీకి చెప్పేశాను కూడా. కాని నాయుడుగారు ఒప్పుకోలేదు. "చూడు ప్రసాద్, నువ్వు ఇష్టపడివెళ్తానంటేనే తప్ప పోస్టింగ్ ఆర్డర్స్ వేయడం కుదర్దు" అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశారు. అయినా ఎందుకనో మళ్ళీ ఆలోచించి, "సరే, నేను కూడా ముఖ్యమంత్రి గారికి నువ్విలా అన్నావని చెబుతానే, ఆయనేమంటారో కూడా చూద్దాం" అన్నారు. అక్కడికి నేను - "ఇంక పోస్టింగ్ ఆగిపోయినట్లే, హమ్మయ్య, సమస్య గట్టెక్కింది" అని ఊపిరి పీల్చుకున్నాను. కాని మరో సమస్య అప్పుడే మొదలైందని నాకు ఆ సాయంత్రం సినిమాకి వెళ్ళేదాకా తెలీదు...

★★★

మా కుటుంబమంతా సినిమా చూస్తుండగా మధ్యలో మా అమ్మాయి మాధవికి కుడిమోకాలిలో నొప్పి ప్రారంభమైంది. సినిమా పూర్తయ్యేసరికి మోకాలు వాచిపోయింది. నొప్పి ఎక్కువైపోయింది. మర్నాడు డాక్టర్కి చూపించాం. "ఇదేదో పురుగు కుట్టిన బాపతు" అని డాక్టరు అనుమానించారు. మందులిచ్చారు. అయినా నొప్పి తగ్గలేదు. వాపు తగ్గలేదు. కాలు మడిస్తే చాలు విపరీతమైన నొప్పి. రెండు మూడు రోజులు గడిచాయి. ఎక్స్రే తీశారు. ఇంకేవో పరీక్షలు చేశారు. విషయం తెలియటం లేదు. కానీ మందులవాడకం, దానితోపాటు స్కూలుకి పోలేనంత బాధ మాత్రం అమ్మాయికి పెరిగిపోతున్నాయి. మరోసారి రోజ్మేరీ టెస్ట పరీక్షలు కూడా చేశారు. అన్నింటి ఫలితం ఒక్కటే - "లోపల అంతా బాగానే వుంది". ఏమైనా ముందు - కాలుకి

సగందాకా బ్యాండేజి వేశారు వాపుని తగ్గించటం కోసం. బ్యాండేజి మూలంగా మాధవికి నడక కూడా కష్టమైపోయింది. అలా డాక్టర్లు, టెస్టులు, మందులతో రోజులు గడిచిపోతున్నాయి. “అమ్మా, ఇలా ఎంతకాలమే” అని పిల్ల ఆవేదనతో అడుగుతుంటే సమాధానం చెప్పలేని స్థితి.

అలా అప్పటికి మాధవి స్కూలు మానేసి నెల రోజులవుతోంది. అసలెందుకిలా జరిగింది - అన్న ఆలోచన నన్ను తొలిచేయడం ఎక్కువైంది. అకస్మాత్తుగా, “ఒకవేళ నేను టిటిడి పోస్టింగ్ వదిలించుకోవాలని చూడటమే ఇందుకు కారణమా?” అన్న సందేహం కూడా కలిగింది. మళ్ళీ నేను, గోపిక కూర్చొని గడచిన కథ అంతా నెమరు వేసుకున్నాం. ఛీఫ్ సెక్రటరీ పిలవడం, మేము వద్దనుకోవడం, ఇలా ఛీఫ్ సెక్రటరీకి చెప్పేసి రావడం, అదే సాయంత్రం సినిమాలో మాధవికి మోకాలు నొప్పి ప్రారంభం కావడం, మర్నాటి నుంచి అది స్కూలు మానేయటం.... ఇవన్నీ మా సందేహానికి ఒక సమాధానమిచ్చినట్లు అనిపించింది. అంతే! మర్నాడు నేను చేసిన మొదటి పని - ఛీఫ్ సెక్రటరీని కలిసి, టిటిడికి వెళ్ళటానికి నా అంగీకారం తెలపడం.

నాయుడుగారు చాలా ఉదాసీనంగా చెప్పారు - “రెండు మూడుసార్లు ముఖ్యమంత్రితో ఈ అంశం చర్చకు వచ్చిందయ్యా! కాని ఎవర్ని వేయాలో ఇంకా తేల్చుకోలేదు. సరే, నేను మళ్ళీ సమయం వచ్చినప్పుడు ముఖ్యమంత్రితో మాట్లాడి చూస్తా, ఆయన ఏమంటారో...” అంతే తప్ప, “పోస్టింగ్ నీకే వేయిస్తాలే” అని ఆయన హామీ ఇవ్వలేదు. ముఖ్యమంత్రి చెన్నారెడ్డి గారి ఆగ్రహానుగ్రహాల ప్రభావం ఎలా వుంటుందో తెలిసిన మనిషి కనుక అలాంటి హామీ ఇవ్వటానికి నాయుడుగారు ధైర్యం చేయలేదు... ఏమైనా, “శ్రీనివాసుడు పిలిస్తే రానన్నాను” అన్న వెలితి లేకుండా చెప్పేశాను, ఇక మిగిలింది ఆయనే (శ్రీవారు) చూసుకుంటాడు - అన్నది నా ఆలోచన.

విచిత్రమేమంటే, అందుకు విరుద్ధంగా జరగలేదు. ఆ సాయంత్రం చీఫ్ సెక్రటరీ నుంచి నాకు పిలుపు వచ్చింది. వెళ్ళగానే పోస్టింగ్ ఆర్డర్స్ కూడా ఇచ్చేశారు నాయుడుగారు. ఆ ఆర్డర్ కాపీతో ఇంటికి చేరిన నేను గేటు దగ్గరే నిశ్చేష్టుణ్ణయి నిల్చుండిపోయాను ఆ దృశ్యాన్ని చూసి.

అది - “డాడీ” అంటూ మాధవి పరుగెత్తుకుంటూ వచ్చి నన్ను చుట్టేసింది. “చూడు చూడు, ప్లాస్టర్ తీసేస్తే నేను ఎంత బాగా నడుస్తున్నానో, వాపుపోయింది, నొప్పి పోయింది...” అంటూ మాధవి కాలు మడిచింది, కాలు చాచింది, గెంతింది, దూకింది, పరుగెత్తింది... మాధవి ఆనందానికి అంతులేదు. మరి 40 రోజులుగా ఉన్న ఆ వాపు ఏమైంది?...

★★★

# జపాలకి జడివానలు కురుస్తాయా?

అర్ధరాత్రి దాటాక, తిరుమల గుడి తలుపులు తాళాలు వేశాక, తిరుమలేశుని గుడిలో వుండే నిలువెత్తు గంటలు గణగణమని మ్రోగుతున్నాయి.

అంతకు ముందెన్నడూ అలా జరగలేదు. అనూహ్యమైన, అసాధారణమైన ఈ సంఘటనతో తిరుమల ప్రజలు ఉలిక్కిపడి లేచారు. స్థానిక పౌరులు, సత్రవులలోని యాత్రికులు ఆదరాబాదరా పరుగులు తీశారు ఆలయంవైపు. ఆశ్చర్యం, అనుమానం, ఆందోళన - ఆ సమయంలో దేవాలయం దగ్గరకు చేరిన వాళ్ళందరి మొహాల్లో కొట్టొచ్చినట్లు కనుపిస్తోంది.

"ఎలా జరిగింది? ఎలా జరిగింది?" అనుకుంటూ అంతా ప్రశ్నల వర్షంలో తడిసిపోతున్నారు నిజానికి, నీరు లేక తిరుమల ఎండిపోతోంది!!!

★★★

నేను తిరుమల తిరుపతి దేవస్థానాలకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా వెళ్ళిన మరుసటి సంవత్సరమే - 1979లో - తిరుమల కొండమీద భయంకరమైన నీటి కొరత ఏర్పడింది. ఆ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల తీవ్రత కారణంగా తిరుమలకు నీటిని సరఫరా చేసే గోగర్భం రిజర్వాయర్తోపాటు మరో రెండు చిన్న చెరువులు - ఒక ఆళ్వార్ ట్యాంక్, మరొకటి శ్రీవారి పాదాలకి వెళ్ళే దారిలో వున్నది - కూడా ఆగష్టు నాటికి పూర్తిగా ఎండిపోయాయి. ఇప్పటి పాపనాశనం రిజర్వాయర్ అప్పటికింకా నిర్మాణంలో వుంది. కొండమీద అడపాదడపా నీటి అవసరాలకు ఉపయోగపడే మూడు నాలుగు బావులు కూడా అడుగంటి పోయే పరిస్థితి ఏర్పడింది. తిరుమలలో నీటి వినియోగం మీద అప్పటికే ఆంక్షలు విధించారు.

సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో వచ్చే తుఫానుల వల్ల వర్షాలు కురుస్తాయి. కనుక సాధారణంగా వర్షాలతో అక్టోబర్ నాటికి ఈ ట్యాంకుల్లో, బావుల్లో నీటిమట్టం పెరుగుతుండేది. అదే ఆశతో ఆ సంవత్సరం కూడా వున్న నీటిని పొదుపుగా వాడుకుంటూ అక్టోబర్ దాకా నిరీక్షించాం. కానీ వరుణదేవుడు కరుణించలేదు. ఉన్న నీటి నిలవల్ని ఇంజనీర్లు అంచనా వేసి, మరో మూడు నాలుగు వారాలకు మించి సరఫరా చేయలేమని తేల్చారు. అయినా ఇంకా ఆశ - వర్షాలు ఏదోరకంగా పడకపోతాయా అని. ఒకవేళ వర్షాలు కురవకపోతే... !

ఈ ప్రశ్నకు నాకు రెండు పరిష్కార మార్గాలు కనిపించాయి. మొదటిది - తిరుపతి నుంచి కొండ మీదకు ట్యాంకర్లతో నీళ్ళు రవాణా చేయించడం, రెండోది - నీటి కొరత కారణంగా కొండకు రావద్దని యాత్రికులకు విజ్ఞప్తి చేయటం. ఎందుకంటే తిరుమలలో నీటి సరఫరా మీద కొత్తగా ఆంక్షలు విధించే అవకాశం లేదు. ఈ ఆంక్షలు

అప్పటికే గరిష్ఠస్థాయికి చేరుకున్నాయి. ఆరువేల జనాభా తిరుమలలో వుంది. ఇంకా రోజుకి పాతికవేలదాకా యాత్రికులు వస్తూ పోతుంటారు. వీళ్ళందరికీ నీళ్ళు ఎక్కడ్నుంచి ఇవ్వాలి? ఇవ్వలేకపోతే - భక్తుల దర్శనాల్ని నిరోధించాలా? - నీళ్ళు ఇవ్వలేకపోతున్నాం కాబట్టి శ్రీవారి దర్శనం మానేయండి - అని దేవస్థానాల ధర్మకర్తలు ప్రకటించడం సబబా? కాకపోతే మరేం చేయాలి?... బోర్డులో సభ్యులు ఎంతమందివున్నా, కీలక అంశాలలో మౌలిక బాధ్యత ఎప్పుడూ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. అందుకని నేనే రకరకాల అంచనాలు వేసి ట్యాంకర్లతో నీళ్ళు తెప్పించడం ప్రారంభించాను - అవైనా ఆలయం మెయింటెనెన్సుకి మాత్రమే సరిపోతాయి.

ఇదిలా చేస్తూనే - మరోప్రక్క ఈ సమస్యకు ఆధ్యాత్మిక పరిష్కారం ఏమన్నావుందా అంటూ కూడా నేను శోధన సాగించాను. ఫలితంగా - దేవస్థానాల ఆస్థాన సలహాదారు, వేదవేదాంగాలను ఔపోసన పట్టిన ప్రముఖ పండితుడు ఉప్పులూరి గణపతి శాస్త్రి(90) గారిని నేను సంప్రదించటం జరిగింది. (ఆ తరువాత కాలంలో భారత ప్రభుత్వం గణపతి శాస్త్రిగారిని 'పద్మ విభూషణ్'తో గౌరవించింది.)

ఇలా వర్షాభావ పరిస్థితి ఏర్పడినప్పుడు జపాలు, యజ్ఞాలు చేయటం వంటి పరిష్కారాలు ఏమన్నా వున్నాయా? వుంటే అవి ఆచరణ సాధ్యమా? అందువల్ల ఫలితం ఏమేరకు వుంటుంది?... ఇలాంటి అన్ని రకాల సందేహాలకూ శాస్త్రిగారు ఇచ్చిన జవాబు ఒక్కటే - "ఇలాంటి అన్ని సమస్యలకీ వేదాల్లో పరిష్కార మార్గాలు వున్నాయి. అయితే వాటిల్లో ఏ ఒక్క కర్మని ఆచరించాలన్నా, భగవంతుని పట్ల పరిపూర్ణమైన విశ్వాసంతో, త్రికరణశుద్ధిగా ఆచరిస్తేనే ఫలితం వుంటుంది. ప్రజల్లో నాగరిక జీవనంపట్ల మోజు పెరిగి, ఇలాంటి సనాతన వైదిక విధానాలను ఆచరించటం సన్నగిల్లటం వల్ల, అలాంటి మహాకార్యాలు నిర్వహించగల వేద పండితులు కనుమరుగైపోతున్నారు తప్ప - వేద శాస్త్ర సంపద నిరుపయోగం కాలేదు, కాబోదు..."

ఒక మహా యాజ్ఞీకుని వర్చస్సు వుట్టిపడే శాస్త్రిగారి మొహంలో - వైదిక కర్మలపట్లా, సామాజిక సమస్యలకు అవి ప్రసాదించగల పరిష్కారాల పట్లా కనుపించిన విశ్వాసం నన్ను ఆకట్టుకున్నది. ఈయన ద్వారా ఏదో పరిష్కారం దొరుకుతుందనే ఆశ కలిగింది. శాస్త్రిగారు తన వంశానికి మూలమైన వేదశాఖనే కాక, అన్ని వేదాలనూ - ఉప శాఖలతో సహా - అధ్యయనం చేయటంలోనే 48 సంవత్సరాలు గడిపారు.

వ్యాకరణ, తర్క, వేదాంత, మీమాంస, న్యాయ, నిరుక్త విజ్ఞానాన్ని కూడా సముపార్జించితే తప్ప, వేదార్థాన్ని సక్రమంగా వ్యాఖ్యానించడం సాధ్యపడదు.... ఆ స్థాయిని సాధించిన మహాపురుషుడు శ్రీ గణపతి శాస్త్రి - అని ఆ సంభాషణలో నేను అర్థం చేసుకున్నాను. దాంతో శాస్త్రిగారి మార్గదర్శకత్వం మీద గురి, ఆశ కూడా నాలో పెరిగాయి. శాస్త్రానుసారంగా ఏం చేయాలంటే అది, ఎలా చేయాలో అలాగే త్రికరణశుద్ధిగా చేయటానికి, చేయించటానికి నేను సిద్ధమయ్యాను. అప్పటి నా లక్ష్యం

ఒక్కటే - ఎంత క్లిష్టమైన విధానమైనా సరే ఆచరించి, నీటిని సాధించాలి. యాత్రికులకు సహాయపడాలి.

గణపతి శాస్త్రిగారు - వరుణ జపం నిర్వహిస్తే వరుణదేవుడు కరుణించి వర్షిస్తాడని తరణోపాయం చెప్పారు. అది ఎలా నిర్వహించాలో కూడా చెప్పారు. కానీ తానుగా వచ్చి చేయించలేనంటూ తన అశక్తతని (అనారోగ్య కారణాలవల్ల) వ్యక్తం చేశారు. అయితే ఎక్కడెక్కడ్నుంచి ఏయే ఋత్విక్కుల్ని పిలిపించి ఈ కార్యాన్ని నిర్వహింపచేయవచ్చో వివరించారు.

చివరికి నవంబరు 1 నుంచి వరుణజపం ప్రారంభించాలని నిర్ణయించాం. కాని అది జరగలేదు. వాయిదా పడుతూ వచ్చింది. ఒకరోజు ఎవరో పండితుడి ఇంట్లో అశౌచం అన్నారు. మరోరోజు మరో పండితుడికి అనారోగ్యం అన్నారు. మరో పండితుడికి మరో రోజు మరో సమస్య... - ఓ ప్రక్కన గోగర్భం రిజర్వాయరులో నీటిమట్టం రోజురోజుకీ క్షీణించిపోతోంది. మరోవారం రోజులకి మించి నీటి సరఫరా అసాధ్యం - అంటూ ఇంజనీర్లు చేతులెత్తేశారు. ఆశ పెట్టుకున్న వరుణ జపం ఆరంభానికా రకరకాల ఆటంకాలు... అలా వారం రోజులు గడిచిపోయాయి. నేను సేవిస్తున్న శ్రీవారిని మరోసారి తల్చుకున్నాను - "ఏమిటీ పరీక్ష! ఎంతకాలం ఈ సందిగ్ధస్థితి? - ఈ కార్యక్రమం సక్రమంగా జరగదా? దీనికి నీ ఆమోదం ఇంకా రాలేదా?..." ... చివరికి ఎలాగైనా సరే నవంబరు. 8 నుంచి వరుణ జపం చేసి తీరాలని నిర్ణయించుకున్నాం.

భగవంతుని ఆమోదం అయిందా లేదా అన్న ప్రశ్నకు సమాధానంగా ఆ (నవంబరు 7) అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆలయం తలుపులు మూసివున్న తరుణంలో ... తిరుమల గిరులు ప్రతిధ్వనించేలా శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలిలో భారీ గంటలు 'గణగణ' మ్రోగాయి... తిరుమల ఒక్కసారి ఉలిక్కిపడి లేచింది. జనం లేచి పరుగెత్తారు "ఈ గంటల మోత ఎక్కడ్నుంచి" అనుకుంటూ. టి.టి.డి. ఉద్యోగులకు ఆ గంటల మోత ఆలయం లోంచి అని అర్థమైంది. కానీ నమ్మలేని స్థితి. అర్ధరాత్రి ఏకాంతసేవ పూర్తయ్యాక, తలుపులన్నీ తాళాలు వేశాంగదా, ఈ గంటలమోత ఎక్కడిది - అన్న సంభ్రమాశ్చర్యాలు వాళ్ళని ముంచెత్తాయి.

లౌకిక ఆలోచనా ధోరణిలో అందరూ - "ఎవడో యాత్రికుడు లోపలవుండిపోయి వుంటాడు. వాడే ఈ పని చేసుంటాడు - తలుపులు తీయించడం కోసం" అనుకున్నారు. ఏమైతేనేం, సుప్రభాతసేవ కోసం తెల్లవారు ఝామున మూడు గంటలకు తలుపులు తీయాలి.... తీశాం. మూలమూలలా గాలించాం - గంటలు మ్రోగించిన 'శక్తి' ఎవరా అని గర్భగుడిలో 'మూలవిరాట్' తప్ప మరో శక్తి కనబడలేదు! అప్పుడు నాకు అనిపించింది - వరుణ జపానికి శ్రీవారి ఆమోదం లభించిందని.

తెల్లవారుతూనే వరుణ జపం ప్రారంభం కావాలి. అంతకుముందు వరకూ ఏవేవో కారణాలవల్ల రాలేకపోయిన ఋత్విక్కులు సహితం ఆరోజు వచ్చేశారు. వరుణ జపంలో రకరకాల కార్యక్రమాలున్నాయి. కొందరు పండితులు పుష్కరిణిలో ఛాతీలోతు నీళ్ళలో నిలబడి జపం చేయాలి. మరికొందరు శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేయాలి. మరోప్రక్క వరుణ దేవుణ్ని ఆరాధిస్తూ హోమం జరపాలి.

అలా మూడు రోజులు చేశాక మూడోరోజు సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు పుష్కరిణి మంటపంలో స్నపన తిరుమంజనం చేయటంతో కార్యక్రమం ముగుస్తుంది. తిరిగి నాలుగోరోజు ఉదయం 7 గంటలకు స్వామివారికి సహస్ర కలశాభిషేకం (కార్యక్రమం సజావుగా జరిపించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ) చేస్తారు... అలా ఋత్విక్కుల వేదమంత్రోచ్చారణల మధ్య మూడు రోజుల కార్యక్రమం సవ్యంగా జరిగిపోయింది.

మూడోరోజు సాయంత్రం స్నపన తిరుమంజనం దాకా ఏ విశేషమూ లేదు. ఎక్కడా మబ్బులు కమ్మే ఛాయలు కనబడటంలేదు. సూర్యుడు ప్రకాశవంతంగా కనుపిస్తూనే వున్నాడు. “సరే, ఏం చేస్తాం, మన ప్రయత్నం మనం చేశాం” అనుకుంటూ నాతోసహా ఋత్విక్కులంతా ఉత్సవ విగ్రహాల్ని పుష్కరిణి నుండి బయటకు తీసుకువచ్చి, ఆలయంవైపు నడుస్తున్నారు. అక్కడి నుంచి అక్కడికి అంతా కలిపి ఓ వంద గజాల దూరం ఉంటుందేమో. “కన్నీళ్ళే తప్ప, వర్షం నీళ్ళు కనబడటం లేదే” అంటూ ఊరేగింపు వెనకాల నుంచి విలేకరుల వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి...

క్షణాల్లో ... ఆకాశం ఉరిమింది... కుండపోతగా వాన ప్రారంభమైంది. ఎంత ఉధృతంగా ఆకాశం వర్షించిందంటే, శ్రీవారి ఉత్సవ విగ్రహాల్ని తడవకుండా ఆలయంలోకి చేర్చడం కోసం పండితులంతా ఆ కొద్ది దూరం పరుగులు తీయాల్సి వచ్చింది. మామూలుగా అయితే ముందు జాగ్రత్త చర్యగా విగ్రహాలకి ఛత్రం పడతారు. ఆ రోజు వాతావరణం అలాంటి అవసరాన్ని సూచించలేదు. కనుక ఛత్రాలు తేలేదు. దాంతో ఆలయం చేరేసరికి అంతా తడిసి ముద్దయి పోయాం. అలా మొదలైన ఆ కుండపోతవాన మర్నాడు ఉదయం 7 గంటలకి సహస్ర కలశాభిషేకం ఆరంభమయ్యేదాకా నిరాటంకంగా కురుస్తూనే వుంది. సహస్ర కలశాభిషేకం ప్రారంభం కాబోతుండగా, ఛీఫ్ ఇంజనీరు పరుగెత్తుకుంటూ వచ్చి నా చెవిలో వేశారు - “గోగర్భం రిజర్వాయర్ పొర్లి ప్రవహిస్తోంది”. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అప్రయత్నంగా శ్రీనివాసుడికి నమస్కారం చేశాను. విచిత్రం ఏమంటే - తిరుమల గిరుల చుట్టుప్రక్కల తిరుపతి, రేణిగుంట, కాళహస్తి, రైల్వే కోడూరుల వైపు ఎక్కడా ఆ వర్షం ఛాయలు కూడా కానరాలేదు. ఒక్క తిరుమల కొండని మాత్రమే జడివాన ముంచెత్తింది ఆ రాత్రంతా. ఆ సంఘటన కాకతాళీయమా? వేద మంత్రాల శక్తి ప్రభావమా? భక్తులు నమ్ముతున్న ఆ దేవుని అనుగ్రహమా?

# కొండ–ఉప్పు–బెల్లం

తిరుపతి కొండమీద లడ్డు గొప్పదా? తిరువళ్ళూరు వీరరాఘవ స్వామి పాదాల దగ్గర లవణం గొప్పదా?... ఎవరు చెప్పగలరు?

**శ్లో॥ విద్యావినయ సమ్పన్నే బ్రాహ్మణే గవి హస్తినే ।**
**శునిచైవ శ్వపాకేచ పణ్డితా స్సమదర్శిన ॥**

అన్ని ప్రాణుల్ని సమభావంతో చూడాలన్నదే శ్రీ కృష్ణ భగవానుడు గీతలో ప్రవచించిన ఈ శ్లోకానికి అర్థంగా చాలామంది చెబుతుంటారు. నిజానికి 'సమ' పదానికి అర్థం సమానత్వం కాదు. 'సమ' అంటే 'నేనే' అని కృష్ణభగవానుడు మరొక శ్లోకంలో చెప్పిన నిర్వచనం ఇక్కడ అన్వయిస్తుంది. అంటే, ప్రతి ప్రాణిలోనూ ఒకేవిధంగా వున్న భగవంతుణ్ణి చూడగలగాలి. పామరుడిలోనూ, పండితుడిలోనూ, కలిమి కలవాడిలోనూ, లేమి నిండిన వాడిలోనూ, ఎలుకలోనూ, ఏనుగులోనూ కూడా దైవం ఒకేవిధంగా (సమ) వుంటాడు. ఆయన్ని చూడగలగాలి...

ఇది చెప్పటం వేరు. మానసికంగా అంగీకరించి, అనుభవించటం వేరు. మన వేద శాస్త్రాలలో నిబిడీకృతమై వున్న ఈ మౌలిక సూత్రాన్ని జీర్ణించుకుని, వంట పట్టించుకోవటం అంత సులభమైన విషయమా?

పైగా ఏటా కోట్లాది భక్తుల్ని, వాళ్ళ నుండి వందలాది కోట్లరూపాయల ముడుపుల్ని ఆకర్షిస్తూ, కలియుగ వైకుంఠంగా భాసిల్లే తిరుమల శ్రీనివాసుని సన్నిధిలో పనిచేసే టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్కి - ఇంతటి పరిణతి నిండిన 'సమభావన' సాధ్యమా? అందులోనూ - ప్రతి ఒక్కరూ "ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ - స్వామివారి ప్రథమ సేవకుడు" అని పదే పదే అంటూంటే, అది నిజమేనేమోనన్న 'భ్రమ'కి లోనుకాకుండా, సమభావంతో వ్యవహరించడం సులభమా?

నిజానికి శాస్త్రాలు - ఈ విగ్రహారాధన పట్ల స్పష్టమైన విశ్లేషణనిచ్చి వున్నాయి. "మనం పూజించేది విగ్రహాన్ని కాదు - అందులో వుందని భావిస్తున్న దైవాన్ని." భగవంతుడు ప్రపంచమంతా వ్యాపించి వున్నాడు. స్వయంభూ విగ్రహంలో ఈ దైవత్వం మరింత ఎక్కువ వుంటుందంటారు. ప్రతి ఆలయంలోని విగ్రహంలోనూ ఈ శక్తి వుంటుంది. కాని దాని పరిమాణం ఆయా విగ్రహ ప్రతిష్ఠల వెనుకగల పవిత్రత, భక్తి మీద ఆధారపడి వుంటాయి - అంతకుమించితే, భగవంతుడు ఎక్కడైనా ఒక్కటే. అతడు సర్వవ్యాపితుడు, సర్వశక్తిమంతుడు, సర్వగుణ పరిపూర్ణుడు. ఈ విషయమే - పై శ్లోకంలో స్పష్టమవుతుంది.

అయినా - నేను టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా వుండగా, స్వామివారి ప్రథమ సేవకుడ్ని నేనే అన్న 'భ్రమ' నాలో ఎంతటి బలమైన విశ్వాసానికి దారి తీసిందంటే - "నిజమైన స్వామి ఇక్కడే వున్నాడు. ఇతర చిన్న ఆలయాల్లోనూ, జనాకర్షణ లేని

ఆలయాల్లోనూ అంతటి శక్తి లేదు” అనే భావన నాలో ఎక్కడో అంతర్లీనంగా చోటు చేసుకుంది...

అలాంటి పరిస్థితిలో ఒకసారి మద్రాసుకి సమీపంలోని తిరువళ్ళూరులోని వీరరాఘవ స్వామి బ్రహ్మోత్సవాలకి నన్ను ఆహ్వానించారు. అక్కడ వీరరాఘవ స్వామి ఆలయంలో గరుడసేవ తెల్లవారుఝామున అయిదు గంటలకి చేస్తారు. (తిరుమలలో ఈ సేవ రాత్రి తొమ్మిది గంటలకి చేయటం ఆనవాయితీ.) ఆలయ ధర్మకర్తలు నన్ను ఆ గరుడసేవలో పాల్గొనేలా రావలసిందిగా ఆహ్వానించడంతో, నేను సకుటుంబంగా బయల్దేరి, ఆ ముందురోజు రాత్రి మద్రాసులో ఒక బంధువుల ఇంటికి చేరుకున్నాను. నిర్ణీత కార్యక్రమం ప్రకారం ఆ రాత్రి బంధువుల ఇంట్లో విశ్రమించి, మర్నాడు తెల్లవారుఝామున తిరువళ్ళూరు వెళ్ళాలి.

ఆ రాత్రి భోజనాలు పూర్తయ్యాక కబుర్లు చెప్పుకొంటుంటే, ఒక బంధువు మాటల్లో అన్నారు - వీరరాఘవస్వామి దర్శనానికి వెళ్ళేవారు స్వామివారి పాదాల దగ్గర ఉప్పు, స్వామి వారి పుష్కరిణిలో బెల్లం సమర్పించడం సాంప్రదాయంగా వస్తోంది - అని. అలా చేస్తే, భక్తులకుండే అన్ని ఈతి బాధలు ఈ నీళ్ళలో బెల్లంలా కరిగిపోతాయని విశ్వాసం... నేను నవ్వాను. “బహుశా ఉప్పుకీ, బెల్లానికి మార్కెట్ కల్పించటం కోసం పాతకాలంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎవడో ఈ ట్రిక్ కనిపెట్టి వుంటాడు” - అంటూ ఓ ఉచిత వ్యాఖ్య విసిరాను. అందరం నవ్వుకున్నాం.

★★★

వేకువ ఝామున లేచి, నేను, నా భార్య గోపిక, మా అమ్మాయి మాధవి (9 ఏళ్ళు), అబ్బాయి సంజీవ్ (5 ఏళ్ళు) రెడీ అయ్యాం. అయిదు గంటలకల్లా తిరువళ్ళూరు చేరుకున్నాం. గరుడవాహనం సిద్ధంగా వుంది. ఉత్సవ విగ్రహాన్ని తీసుకువచ్చి గరుడవాహనంపై ఉపస్థితం చేశారు. మమ్మల్ని ఆలయ మర్యాదలతో ఆలయంలోకి ఆహ్వానించారు. ఇప్పటి టి.టి.డి. పారె పత్తేదారు శేషాద్రి సహా కొందరు టిటిడి సిబ్బంది కూడా ఆ ఉత్సవాలకి వచ్చి వున్నారు. ఆలయ అధికారులు మాతో “ముందుగా మూలవిరాట్‌ని, అమ్మవారిని దర్శించుకొని రండి. ఆనక స్వామివారి ఊరేగింపులో పాల్గొందురుగాని” అంటూ సూచించడం, మేం “అలాగే” అంటూ గర్భగుడిలో ప్రవేశించడం జరిగింది.

పడుకుని వున్నట్లు వుండే శ్రీ వీరరాఘవ స్వామి విగ్రహాన్ని అద్భుతంగా అలంకరించారు. కన్నుల పండుగగా వుందా అలంకారం. అర్చకులు మా గోత్రనామాలు తీసుకుని ఆ స్వామివారికి అర్చన ప్రారంభించారు. కొద్ది క్షణాల్లో - అప్పటిదాకా హుషారుగా వున్న మా అబ్బాయి సంజీవ్- ఒక్కసారిగా ‘కడుపులో నొప్పి’అనటం ప్రారంభించాడు. “ఏదో నొప్పి, తగ్గిపోతుందిలే కాస్త ఓపిక పట్టు”

అంటున్నాం. కాని, కొన్ని సెకన్ల వ్యవధిలో వాడికి బాధ ఎక్కువైంది. కడుపు పట్టుకుని మెలికలు తిరిగిపోవటం ప్రారంభించాడు. దాంతో మా అర్చన పాడుకాకుండా చూడటం కోసం, మాతోవున్న శేషాద్రి - సంజీవ్‌ని ఎత్తుకుని బైటకు తీసుకువెళ్ళాడు.

కొద్దిసేపటికి ఈ అర్చన పూర్తయింది. అదే ప్రాకారంలో అమ్మవారి గుళ్ళోకి వెళ్ళి, అమ్మవారికి అర్చన ప్రారంభించాం. ఈలోగా శేషాద్రి వచ్చాడు. సంజీవ్‌కి నొప్పి తగ్గలేదనీ, కారులో అలాగే బాధపడుతూ పడుకొన్నాడనీ చెప్పాడు. మేంకూడా "అమ్మవారి అర్చన పూర్తిచేసుకొని ఒకేసారి బైటకు వెళ్ళి చూద్దాంలే" అనుకున్నాం. అమ్మవారి అర్చనలో కూర్చున్నాం. అంతే... !

మరికొద్దిక్షణాల్లో మాతోనే వున్న మా అమ్మాయి మాధవికి కడుపులో నొప్పి ఆరంభమైంది. క్షణక్షణానికి ఆ నొప్పి పెరిగిపోయి, పిల్ల సుడులు తిరిగిపోతోంది. మళ్ళీ శేషాద్రి చొరవ తీసుకుని, మాధవిని కూడా బైటకు పంపించాడు. అర్చన ఇంకా మధ్యలోనే వుంది. ఇంతలోనే పిల్లలిద్దరికి కడుపునొప్పి! మా ఏకాగ్రత చెడిపోయింది. ముందు అర్చన పూర్తి చేయాలా, పిల్లల సంగతి చూడాలా? ... మనసంతా వికలమైపోతోంది. అర్చకులు మంత్రాలు చదువుతూ వున్నారు. కానీ, మాకు మాత్రం మనస్సు అక్కడ నిలవడం లేదు. గోపిక, నేనూ మొహాలు చూసుకుంటున్నాం. తను వుండబట్టలేక బైటకు చూస్తోంది. పిల్లల గురించి ఆందోళన వ్యక్తం చేస్తోంది. అర్చన ఇంకా పూర్తికాలేదు. మధ్యలో లేచిపోవటానికి నాకు మనస్కరించడం లేదు.

మా పరిస్థితిని గమనించిన ఒక అర్చకుడు సంశయిస్తూనే ఇలా అన్నారు - "అయ్యా! ఇక్కడ ఇలా జరగటం చాలా అసాధారణ విషయం. ఎక్కడో ఏదో లోపం జరిగినట్లుంది..." ఇది వింటూనే, -ప్రశ్నార్థకంగా గోపిక నా వంక చూసింది. నేను - జరిగిన సంఘటనలన్నీ నెమరువేసుకోవటం ఆరంభించాను.

చటుక్కున - ఆ ముందు రాత్రి నేను మద్రాసులో "ఇక్కడి ఉప్పు, బెల్లం సాంప్రదాయం" గురించి చేసిన వ్యాఖ్య స్ఫురణకు వచ్చింది. నన్ను నేను ప్రశ్నించుకున్నాను. "నేనేమైనా అపరాధం చేశానా?"

మరుక్షణం నేను పర్సు తీసి, శేషాద్రికి డబ్బులిచ్చి "ఉప్పు, బెల్లం తీసుకురా. ఇక్కడి సాంప్రదాయం ప్రకారం స్వామివారికి సమర్పిద్దాం" అన్నాను. శేషాద్రి తిరిగి వచ్చేలోపల నేను వీరరాఘవ స్వామిని తల్చుకుని, "అపరాధాన్ని మన్నించు స్వామీ" అనుకున్నాను. అంతమాత్రాన పిల్లలకి కడుపు నొప్పి తగ్గిపోతుందా!

కొద్ది నిమిషాల తర్వాత శేషాద్రి ఉప్పు, బెల్లం తీసుకువచ్చాడు. అద్భుతం! శేషాద్రి వెనకాలే నవ్వుకుంటూ, గెంతుకుంటూ మాధవి, సంజీవ్ వస్తున్నారు. గోపిక, నేనూ మా కళ్ళని నమ్మలేకపోయాం. భరించలేని కడుపునొప్పితో మెలికలు తిరిగిపోతుంటే, శేషాద్రి మోసుకెళ్ళిన పిల్లలు చెంగు చెంగున గెంతుకుంటూ

వస్తున్నారేంటి? మేము, మాతోపాటు ఆ సన్నివేశాన్ని చూసిన అర్చకులూ, ఇతర సిబ్బందీ, భక్తులూ అంతా సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయాం. మా మనసులు కుదుటపడ్డాయి. అంతే! వెంటనే మేం అత్యుత్సాహంతో, అదే ప్రాకారంలో వుండే వీర రాఘవ స్వామి పాదాల దగ్గర లవణాన్ని అర్పించాం. పుష్కరిణిలో గుడం కలిపేశాం.

మనస్ఫూర్తిగా అప్పుడనిపించింది - స్వామి సర్వాంతర్యామి. అది తిరుమల కావచ్చు, తిరువళ్ళూరు కావచ్చు. తిరుమలేశునికి నేనే ప్రథమ సేవకుణ్ణనే భ్రమలో ఈ 'సమభావం' ప్రదర్శించలేకపోవటమే నేను చేసిన తప్పా? అందుకే స్వామి నాకీ మనోవికాస పరీక్ష పెట్టాడా?

★★★

# శ్రీనివాసుడు నిర్దయుడా?

"ఎంత నిర్దయుడివి? నీ దర్శనం కోరి వస్తున్న నా కుటుంబాన్ని ఇలా అర్ధరాత్రివేళ ఈ కొండల మధ్య ఘాట్ రోడ్డులో నిర్దాక్షిణ్యంగా వదిలేస్తావా? ఛీ... నా జీవితకాలంలో మళ్ళీ ఎన్నడూ నీ దర్శనం చేసుకోవాలని కోరుకోను. చాలు. ఈ అనుభవం చాలు..." అని తిరుమల వేంకటేశ్వరుణ్ణి కసితీరా తిట్టుకుంటున్న ఆ పెద్దమనిషి - ఒక అరగంట తరువాత ఎదురైన అనుభవంతో చలించిపోయాడు. పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. 'గోవింద నామ స్మరణ ఒక్కటే తన జీవితానికి పరమావధి' అంటూ పదే పదే లెంపలు వేసుకున్నాడు!!

★★★

నేను టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా వున్నంతకాలం (1978-82), శ్రీవారి ఆలయంలో జరిగే అన్ని సేవల విషయంలోనూ, యాత్రికులకు సదుపాయాల విషయంలోనూ, సేవల మెరుగుదల విషయంలోనూ "ఇంకా ఏమైనా చేయగలమా" అని తాపత్రయపడుతుండేవాడిని. ఆ కారణంగానే వీలైనన్ని ఎక్కువసార్లు సుప్రభాతం నుంచి రాత్రి ఏకాంతసేవ దాకా అన్ని సేవలకూ హాజరవ్వాలని ప్రయత్నం చేస్తుండేవాడిని. ముఖ్యంగా శుక్రవారం అభిషేకానికి ఎట్టి పరిస్థితుల్లోనూ నేను హాజరవుతుండేవాడిని.

అయితే ఈ సేవ తెల్లవారుఝామున 4.30 గంటలకే ( సేవలో పాల్గొనే భక్తులతో ఊరేగింపుగా ఆరంభమవుతుంది. అందుకని ప్రతి గురువారం మధ్యాహ్నమే తిరుపతిలో బయల్దేరి, దారిలో ఆకస్మిక తనిఖీలు చేసుకుంటూ, నాలుగ్గంటలకల్లా కొండకి చేరుకోవటం, అక్కడ మళ్ళీ అధికారులతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించటం చేసేవాడిని. అలా చివరికి ఆలయం చేరుకుని, రాత్రి 9.30 గంటలదాకా

వుండి, పూలంగి సేవ దర్శనం చేసుకున్నాక గెస్ట్ హవుస్‌కి చేరుకోవడం, తెల్లవారుఝామున 4. 30కి అభిషేక సేవకి వెళ్ళటం రివాజయిపోయింది.

1980లో ఒక గురువారంనాడు మాత్రం నా కార్యక్రమం అంతా తారుమారయిపోయింది. తిరుపతిలోనే ఆఫీసుపని వత్తిడి కారణంగా రాత్రి 8 గంటలయినా నేను తిరుమలకు బయల్దేరటం కుదరలేదు. ఇంటిదగ్గరే భోజనం చేసి, 9. 30 కల్లా బయల్దేరాలనుకున్నాను. ఆ టైమ్ కూడా అయింది. అయినా ఇంకా ఇంటిదగ్గర క్యాంప్ ఆఫీసులోనే కూర్చుని, ఏవో ఫోన్ కాల్స్ వస్తే మాట్లాడుతూ వుండిపోయాను. నా పర్సనల్ అసిస్టెంట్, డ్రైవర్ నా కోసం నిరీక్షిస్తున్నారు. పది దాటింది. నా భార్య గోపిక వచ్చి, "ఇంకా బయల్దేరలేదేంటి?" అని అడిగింది. సాధారణంగా ప్రతి శుక్రవారం అభిషేకానికి నాతోపాటు వచ్చే అలవాటు ఆమెకుంది. ఆ రోజు మాత్రం ఇంట్లో అతిధులుండిపోయారని రానంది. కాని, నేనెలాగూ లేటయిపోవడం గమనించాక, "పోనీ, రాత్రికి ఇక్కడే వుండిపోయి, తెల్లవారుఝామున 3.30కి బయల్దేరండి. నేనూ రావటానికి ప్రయత్నిస్తాను" అంటూ ఒక సూచన కూడా ఇచ్చేసింది. నాకు నచ్చలేదు. "రాత్రికి ఇక్కడ పడుకునే ప్రశ్నేలేదు. నేనీక్షణమే బయల్దేరుతున్నాను" అనేశాను... అన్నాను కానీ మళ్ళీ ఎందుకో బద్ధకించాను. ఒక 20-30 నిమిషాలు ఏవో ఫైళ్ళు - కాగితాలు చూస్తున్నాను. ఈలోపల గోపిక మళ్ళీ రెండు మూడుసార్లు వచ్చి నా వ్యవహారం చూసి, పెదిమలు విరుచుకుంటూ వెళ్ళిపోయింది...

అలా 10.30 అయిందేమో... ఒక్కసారిగా చూస్తున్న ఫైలుని అర్ధాంతరంగా మూసేశాను. ఛివాల్న కుర్చీలోంచి లేచిపోయాను. ఎవరో వెంటబడి తరుముతున్నారా - అన్నంత వేగంగా వెళ్ళి కారులో కూర్చున్నాను. డ్రైవర్ని "పోనీవయ్యా" అన్నాను. మరో పది నిమిషాల్లో ఘాట్ రోడ్ ఆరంభంలోని అలిపిరి టోల్ గేట్ చేరుకున్నాం. (భద్రతా కారణాల వల్ల అప్పట్లో 10 గంటలకే టోల్ గేట్ మూసేసేవాళ్ళు.) నాకోసం టోల్గేట్ తెరిచారు. ఆరోజు తిరుమలకి ట్రాఫిక్ చాలా ఎక్కువగా వుందన్నారు టోల్ గేట్ సిబ్బంది. రద్దీ ఎక్కువుందంటే, దర్శనానికి నిరీక్షణ కనీసం 7-8 గంటలు పట్టే పరిస్థితన్నమాట...

అర్ధరాత్రి ఘాట్ రోడ్డులో కారు ప్రయాణం. చల్లటి గాలికి మామూలుగా అయితే ఒక కునుకు పట్టేదే. కాని ఆ రోజు నిద్ర రావటం లేదు. "కార్యక్రమం అంతా ఇలా లేటయిపోయిందేమిటి?" అన్న చిరాకుకి తోడు త్వరగా తిరుమలకి చేరుకోవాలన్న ఆదుర్దా వెంటాడుతోంది. నిజానికి తెల్లవారుఝామున నాలుగు గంటలలోపల ఎప్పుడు చేరినా ఒకటే, అయినా ఏదో తెలీని ఆదుర్దా - త్వరగా వెళ్ళాలనిపించేలా చేస్తోంది. "కొంచెం త్వరగా వెళ్లాం పద" అంటూ డ్రైవర్ని హెచ్చరించాను. అసలు ఘాట్ రోడ్డులో - ఎంత అలవాటున్న డ్రైవరయినా అందులోనూ రాత్రిపూట - వేగంగా వెళ్ళటానికి సాహసించరు. అలాగే డ్రైవర్ ఏదో అవస్థపడుతున్నాడు.

ఆ ఘాట్ రోడ్డులో అన్ని మలుపులు తిరిగేశాం. ఇంకొక్క కిలోమీటరు ప్రయాణిస్తే తిరుమల చేరుకుంటాం అనగా, చివరి మలుపు దగ్గర, ఆ కారుచీకట్లో ఒక పెద్దాయన నిలబడి, మా కారు ఆపమంటూ ఆత్రుతగా చేతులు వూపుతున్నాడు. కారు హెడ్లైట్స్ వెలుగులో గమనించాను - ఆయన వెనకాల ఒక అంబాసిడర్ కారు ఆగివుంది. మా డ్రైవర్ని కారాపమన్నాను. ఎవరాయన? అంత అర్ధరాత్రిలో అక్కడ ఎందుకున్నాడు?... నేనీ ప్రశ్నలు అడిగే లోపలే ఆయన కారు దగ్గరకి వచ్చి, "సార్ మీలాగానే యాత్రకని వచ్చాం. మా కారు చెడిపోయింది. మేం అర్జంటుగా కొండపైకి వెళ్ళాలి. కొంచెం లిఫ్ట్ ఇవ్వరా, ప్లీజ్, ప్లీజ్" అంటూ ఆందోళన నిండిన స్వరంతో ఇంగ్లీషులో అడుగుతున్నాడు. నా ప్రశ్నలన్నీ వాయిదా వేసుకుని, "మీరు ఎంతమందున్నారు?" అని అడిగాను. ఆయన, ఆయన భార్య, కూతురు, అల్లుడు, డ్రైవరు - మొత్తం అయిదుమంది. మా కారులో నేను, నా పి.ఏ, డ్రైవరు. - "ఇంతమంది ఎలా పడతాం నా కారులో" అన్న ఆలోచన కూడా నాకు రాలేదు. అనాలోచితంగా వాళ్ళందర్నీ (లగేజితో సహా) మా కారులోకి ఎక్కించుకున్నాను... అప్పుడు గమనించాను - ఆయన కూతురు, అల్లుడూ పసుపు బట్టల్లో (మధుపర్కాల్లో) వున్నారు. అంటే అప్పుడే పెళ్ళి చేసుకు వస్తున్నారన్నమాట. విచిత్రం! వాళ్ళు కారు ఎక్కగానే నాలో అంతకుముందున్న చిరాకు, ఆదుర్దా మటుమాయమైపోయాయి!!

తిరుమలకి చేరే లోపల ఆయన బెంగ, ఆందోళన మిళితమైన కంఠంతో తన కథంతా చెప్పేశాడు. దాని సారాంశం ఆయన మాటల్లో :

"మైసూరులో హోటల్ వ్యాపారం మాది... తిరుమల వేంకటేశ్వరుడు తప్ప నాకు మరో దైవం తెలీదు. అందుకే మా అమ్మాయి పెళ్ళి కొండమీద చెయ్యాలనుకున్నాను. కానీ మా వియ్యంకుడి పట్టుదల కారణంగా, మైసూరులో చేశాను. అయితే వివాహం అయిన వెంటనే పసుపు బట్టల్లో అమ్మాయినీ, అబ్బాయిని తీసుకుని శ్రీనివాసుడి దర్శనం చేయిస్తానన్నాను. దానికి ఆయన ఒప్పుకున్నారు... అలాగే, ఇదిగో ఈ ఉదయం 10 గంటలకి మైసూరులో పెళ్ళి జరిగింది. వెంటనే బెంగుళూరు మీదుగా తిరుమల వచ్చి, రాత్రి ఏడుగంటలకల్లా స్పెషల్ దర్శనం (రూ. 50 అప్పట్లో) పూర్తి చేసుకుని, వెంటనే బయల్దేరితే, రేపు ఉదయానికల్లా మైసూరు చేరిపోవచ్చనుకున్నాం... పెళ్ళికి వచ్చిన బంధువులంతా అక్కడే వున్నారు. పెళ్ళి సంబరాలు ఇంకా జరగాల్సినవి కూడా వుండి పోయాయి. కాని మా దురదృష్టం కొద్దీ, దారంతా రైల్వే గేట్లు, ట్రాఫిక్ స్తంభించటాలూ వగైరా కారణాల వల్ల మేం అలిపిరి చేరేసరికి 10 గంటలయింది. టోల్ గేట్ మూసేశారు. అక్కడి సిబ్బందిని బ్రతిమాలి, మా కథంతా చెప్పి 12 గంటలలోపు దర్శనం చేసుకుని తెల్లవారే సరికి మైసూరు చేరాలయ్యా అని అర్థిస్తే వదిలారు. ఇప్పుడు మీరు కూడా వాళ్ళని అలాగే బ్రతిమాలి వుంటారు కదా!..."

ఇలా చెబుతూ ఆయన ఆగిపోయాడు. నేను - "అంతే, అంతే" అంటూ మాటమార్చేశాను. నేనెవరో చెప్పలేదు. ఆ తరువాత కథ నాకు అర్థమయిపోయింది. ఘాట్ రోడ్డులో వాళ్ళ కారు చెడిపోయింది. ఇప్పుడు ఆయన సమస్య అంతా ఆలయంలో దర్శనం మూసేసే (12 గంటల లోపల అమ్మాయిచేత, అల్లుడి చేత దర్శనం చేయించాలి. కారు చెడిపోయి, తన ప్రయాణం అంతా అస్తవ్యస్తంగా జరగటంతో, ఆయన సహనం కోల్పోయాడు. కారు ఆగిపోయిన మరుక్షణం ఆయనకి ఏం చేయాలో తెలీకుండా పోయింది. క్రింద టోల్ గేట్ మూసేశారు. మళ్ళీ తెల్లవారుఝామున నాలుగ్గంటలకి కాని దాన్ని తెరవరు. అప్పటిదాకా ఈ చీకట్లో ఏం చేయాలి? పోనీ నడిచి వెళ్దామా అంటే, 12 గంటల లోపల ఆలయం చేరుకోవటం సాధ్యపడదు. ఎలా? ఎలా? ఈ బెంగతో ఆయన దిగులు పడిపోయాడు.

"స్వామీ, నిన్నే నమ్ముకున్నానే. అనుక్షణం నిన్నే ఆరాధిస్తానే. నీ ఆశీస్సులకోసం కొత్త దంపతుల్ని పెళ్ళిపీటల మీద నుంచి, నానా అవస్థాపడి నేరుగా ఇక్కడికే తీసుకువచ్చానే! అయినా నాకు ఇంత అన్యాయం చేస్తావా? పసుపుబట్టల్లో నిన్ను దర్శించాలని వచ్చిన ఈ పిల్లలకి దర్శనం లేదు. నేను సకాలంలో పెళ్ళిమంటపానికి తిరిగి వెళ్ళే ఆశలేదు. నా భక్తే అన్ని సమస్యలకి పరిష్కారం చూపిస్తుందన్న నా నమ్మకానికి - నా కొత్త అల్లుడి ముందు విలువలేదు. ఈ రాత్రంతా చలిలో ఈ ఘాట్ రోడ్డులో వణుకుతూ జాగరణ చేయటం తప్ప మార్గం లేదు ... ఛీ! ఏం దేవుడవయ్యా నువ్వు? నిన్ను నమ్ముకున్న భక్తుల్ని ఇంత దీనావస్థకి గురి చేస్తావా? ఇంత నిర్దయగా ఈ అడవిలో వదిలేస్తావా ? ... ఎంత గుడ్డిగా నిన్ను నమ్ముకుని వచ్చాను?... ఇంక జన్మలో నీ కొండకి రాను. నిన్ను చూడాలని కోరుకోను..." అనుకుంటూ మనసులో శ్రీనివాసుడ్ని తిట్టుకుంటూ, అల్లుడిముందర అవమానభారం తోడవడంతో కలిగిన దిగులుతో ఖిన్నుడై వుండిపోయిన స్థితిలో, మా కారు ఆయనకి కనబడింది. నేను కారులో ఎక్కించుకోగానే, ఆయన ప్రాణం లేచివచ్చినట్లయింది. అప్పుడు ఆయన అన్న మొదటి వాక్యం - "సర్, మీరెవరో దేవుడు పంపించినట్లుగా వచ్చారండీ....!"

ఇలా ఆయన మాట్లాడుతుండగానే మా కారు తిరుమలలోని గెస్ట్ హవుస్‌కి చేరిపోయింది. అప్పటికి 11. 30 అయింది. ఆయన నాకు 'థాంక్స్' చెప్పేసి, ఆదరాబాదరా దర్శనం కోసం భార్యనీ, పిల్లల్నీ పరుగులు తీయించాలని హడావుడి పడుతున్నాడు. నేను - "ఖంగారు పడకండి, కొంచెం మొహం కాళ్ళు కడుక్కురండి. కారులో వెళ్తాం" అన్నాను. మరో పదిహేను నిమిషాల తరువాత వాళ్ళని నాతోపాటు తీసుకువెళ్ళి, ఆలయంలో వదిలాను. ఆలయ సిబ్బందికి పురమాయించి, నా పనిమీద వెళ్ళిపోయాను. దర్శనాలు ముగిసేవేళకి కొద్ది నిమిషాలు ముందుగా, వాళ్ళకి ప్రత్యేక దర్శనం, హారతి, ప్రసాదం తనివితీరా లభించాయి. టిటిడి అతిధులుగా ఆ రాత్రికి వాళ్ళకి బస, భోజనం కూడా ఏర్పాటయింది. రాత్రికి రాత్రి టిటిడి సిబ్బంది వాళ్ళ కారుని

కూడా రిపేరు చేసేశారు. ఆ రాత్రి వాళ్ళని నేను మళ్ళీ కలుసుకోవటం వీలుపడలేదు. అయితే అప్పటికి ఆయన నా గురించి విచారించి, తెలుసుకున్నాడు... మర్నాడు ఉదయం శుక్రవారం అభిషేక సేవ పూర్తయ్యాక నేను వాళ్ళ గురించి వాకబు చేస్తే, తెల్లవారుఝామున నాలుగ్గంటలకే వెళ్ళిపోయారని తెలిసింది.

రెండురోజుల తరువాత ఆయన నాకు లెటర్ రాశాడు - "... నా కారు ఘాట్ రోడ్డులో ఆగకుండా తిరుమలకి 11 గంటలకే చేరివున్నప్పటికీ, ఆరోజు వున్న యాత్రికుల రద్దీలో ఆ రాత్రి మాకు దర్శనం జరిగివుండేది కాదు. అందుకే మా ఇలవేల్పుడయిన శ్రీ వేంకటేశ్వరుడు మాకు కారు చెడిపోయే పరిస్థితి కల్పించి, మిమ్మల్ని రప్పించాడు. మీ ద్వారా ఈ భక్తుడి కోరిక ఘనంగా నెరవేర్చాడు. అంత గొప్ప దర్శనం మాకు గతంలో ఎన్నడూ జరగలేదు. ఆయన లీల అర్థం చేసుకోలేక, ఆ రాత్రి కొద్దిక్షణాలపాటు విచక్షణ కోల్పోయి, ఆయన్ని ఎంత ద్వేషించానో? ఎన్ని దుర్భాషలాడానో? జరిగినదానికి ఇప్పుడు కుమిలిపోతున్నాను. అనుక్షణం స్వామిని క్షమార్పణలు వేడుకుంటూనే వున్నాను..."

★★★

# కాసులహారం

ఆ రోజు 1980 అక్టోబరు నెల చివరి వారంలో ఒక గురువారం. ఆ మధ్యాహ్నం నేను చాలా అత్యవసరమైన సమావేశంలో వుండగా, ఆలయ పేష్కార్ దగ్గర్నుంచి ఒక ఫోన్కాల్ వచ్చింది. పేష్కార్ నాకు చెప్పిన విషయమేమిటంటే - కర్నాటక నుండి 20 మంది సభ్యుల (భక్తుల) కుటుంబం ఒకటి వచ్చింది. వాళ్ళంతా 108 బంగారు నాణాలతో (కాసులతో) స్వామివారి కోసం ఒక కాసుల హారం (నెక్లెసు) తయారుచేయించారు. ప్రతి ఒక కాసుమీద శ్రీవారి నామం, అమ్మవారి నామం చెక్కించారు. ఆ కాసుల హారాన్ని స్వామి వారికి సమర్పించుకోవాలని ఆ భక్తుల కోరిక. అంతేకాదు, ఆ హారాన్ని ఆ మర్నాడే (శుక్రవారం) అభిషేకానంతరం స్వామివారికి అలంకరిస్తే, తమ కుటుంబసభ్యులంతా శ్రీవారిని ఆ అలంకారంలో చూసి తరించాలన్నది వారి తాపత్రయం.

నిజానికి అప్పటికే కొన్ని దశాబ్దాలకాలంగా అమలులో వున్న నిబంధనల ప్రకారం - ఏ- భక్తుడయినా స్వామి వారికి తమ ముడుపును ఏ బహుమానం రూపంలో ఇవ్వాలనుకున్నా దాన్ని నేరుగా హుండీలో సమర్పించుకోవాలి లేదా, వారి సంతృప్తి కోసం వారు ఆ బహుమానాన్ని ఆలయ అధికారులకిచ్చి రశీదు తీసుకోవచ్చు. అక్కడ్నుంచి ఆ బహుమానం టి.టి.డి. ట్రెజరీకి పంపించబడుతుంది. అలాకాక ఎవరైనా భక్తులు తాము తెచ్చిన బహుమానాన్ని స్వామి వారికి అలంకరింపజేయాలని

కోరుకున్నట్లయితే, వారు ఆ బహుమానం విలువకు సమానమైన సొమ్మును (వర్తన) దేవస్థానానికి చెల్లించాల్సి వుంటుంది. (పాతకాలంలో రాజులు, జమీందారులు, ఇతర సంపన్నులు తరచూ ఇలాంటి బహుమానాలు తీసుకువచ్చి, శ్రీవారికి అలంకరింపజేయాలని పట్టుబడుతుండే నేపథ్యంలో ఈ నిబంధనని ప్రవేశ పెట్టినట్లు కనుపిస్తుంది.) ఈ నిబంధన గురించి పేష్కార్ అప్పటికే భక్తుల బృందానికి వివరించడం జరిగింది. కాని వాళ్ళ ఆరాటం, ఆవేదన ఈ నిబంధన వినిపించుకొనేలా లేవు. శ్రీనివాసుని ఆదేశాల మేరకే తాము ఈ కాసులహారం తయారుచేయించి, తిరుమలకు వచ్చామనీ, ఈ ముడుపు తనకు సమర్పించుకోవటంలో ఏదైనా ఇబ్బంది వుంటే ఎవరినో కలుసుకోవాలని కూడా శ్రీనివాసుడే చెప్పాడనీ... వాళ్ళు పేష్కార్ పదేపదే విన్నవించుకున్నారట. అతనికి ఏం చేయాలో తోచక నాకు ఫోన్ చేశాడు. నేను, "సరే, ఓ గంటలో నేనే అక్కడికి వస్తాలేవయ్యా" అన్నాను. అలాగే కొండమీదకి చేరుకున్నాను. ఆ భక్త కుటుంబాన్ని తీసుకువచ్చి పేష్కార్ నాకు పరిచయం చేశాడు.

★★★

కర్నాటకలోని చిక్ మగళూర్ జిల్లా లక్కపల్లి గ్రామానికి చెందిన ఆ కుటుంబానికి పెద్ద డి.ఎస్. నాగరాజారావు. ఒక ప్రాథమిక టీచర్. తన చిన్న జీతంతోనే అతను తన తల్లిదండ్రుల్ని, చెల్లెళ్ళని, తమ్ముళ్ళని, తన కుటుంబాన్ని పోషించుకోవాల్సిన స్థితి. పేరుకి కొద్దిగా భూమి వున్నా, అదంతా బీడు పడిందవటంవల్ల దానిమీద వచ్చే ఆదాయం శూన్యం. ఆ నాగరాజారావు చెప్పిన కథ ఇలా వుంది...

15-16 సంవత్సరాల క్రితం నాగరాజారావుకి ఒక రాత్రి స్వప్నంలో శ్రీ వేంకటేశ్వరుడు ప్రత్యక్షమై "నాకు కాసులపేరు సమర్పించుకుంటావా?" అని అడిగాడు. దాన్ని నాగరాజారావు పెద్దగా పట్టించుకోలేదు. ఒకరోజు గడిచాక ఒక ఉదయాన్నే ఎవరో భక్తులు అతనింటికి వచ్చి తిరుపతి ప్రసాదం లడ్డు ఇచ్చారు. వెంటనే నాగరాజారావుకి ఆ ముందురోజు రాత్రి కల జ్ఞాపకం వచ్చింది. దాంతో కుటుంబ సభ్యులందర్నీ సమావేశపరిచి, ఈ విషయం చర్చించాడు. "ఏం చేద్దాం" అంటే "ఏం చేద్దాం?" అంటూ అందరూ ముఖాముఖాలు చూసుకున్నారు. ఎందుకంటే ఆ ఇంట్లో ప్రతి ఒక్కరూ శ్రీనివాసుని ఉనికిపట్ల విశ్వాసం, భక్తి వున్నవాళ్ళే - కాని స్వామి వారికి 108 కాసుల పేర్లు సమర్పించుకొనేటంత స్తోమతు వాళ్ళకి లేదు. కనీసం ఒక బంగారు కాసు చేయించే శక్తి కూడా లేదు. ఏం చేయాలో తేల్చుకోలేక "తరువాత చూద్దాంలే" అంటూ ఆ విషయాన్ని అప్పటికి వాయిదా వేశారు.

ఆ రాత్రి మళ్ళీ నాగరాజారావుకి స్వప్నంలో స్వామివారు సాక్షాత్కరించారు. మరోసారి తన అభీష్టాన్ని గుర్తు చేశారు. ఈసారి నాగరాజారావు ఈ అంశాన్ని గట్టిగా మనసుకి తీసుకున్నాడు. మర్నాడు కుటుంబ సభ్యులందర్నీ కూర్చోబెట్టాడు. జరిగిన సంఘటనలన్నీ నెమరువేసుకున్నారు. ఒక నిర్ణయానికి వచ్చారు. అదేమంటే - రాగి

కాసుల హారం తయారు చేయించి, అందులో అక్కడక్కడా కొన్ని వెండికాసులు చేరుద్దామని. మళ్ళీ ఆ రాత్రి నిద్రలో నాగరాజారావుకి శ్రీవారు దర్శనమిచ్చి "బంగారు కాసులపేరు కానుకగా ఈయవా?" అని మరోసారి నొక్కిచెప్పారు. దీంతో నాగరాజారావు తట్టుకోలేకపోయాడు. ఆ రాత్రి ఇంక నిద్రపట్టలేదు. ఎంత త్వరగా తెల్లవారుతుందా, ఎంత వేగంగా ఈ విషయాన్ని ఇంట్లో అందరికీ చెప్పి, పరిష్కారం వెతుకుదామా అన్న ఆరాటంలోనే ఆ మిగతా రాత్రి గడిపాడు. తెల్లవారుతూనే మళ్ళీ కుటుంబమంతా కూర్చున్నారు. "ఇంట్లో ఆడవాళ్ళ మంగళసూత్రాలన్నీ కలిపినా ఒకటి రెండు బంగారు కాసులుకన్నా చేయించలేమే - 108 కాసులతో బంగారు హారం ఎలా చేయించాలి... ఎలా, ఎలా?" అలా తర్జన భర్జనలయ్యాక, "సరే, కానుక కోరిన ఇలవేలుపే, ఈ సమస్యని కడతేర్చే మార్గం చూపిస్తాడు" అనుకున్నారు. అంతే!

... ఆ రోజు నుంచి తమ కుటుంబం అంతా రోజుకి ఒక్కసారి భోజనం మానేసి, అందువల్ల మిగిలే ఖర్చు శ్రీవారి బంగారు కాసుల కోసం ఆదా చేయాలన్నదే వారు తీసుకున్న నిర్ణయం. ఆరుమాసాలపాటు ఆ కుటుంబంలోని పసిపిల్లల దగ్గర్నుంచి వృద్ధులదాకా ప్రతి ఒక్కరూ రోజుకి ఒక పూట ఉపవాసదీక్ష అవలంబిస్తూ వచ్చారు. అలా కూడబెట్టిన సొమ్ముతో ఆరుమాసాల తరువాత వాళ్లు చేయించగలిగింది రెండు బంగారు కాసులు! ఇంకా 106 కాసులు తయారు చేయించాలి. నాగరాజారావు కుటుంబం శ్రీనివాసుడి మీదే భారం వేశారు. నిత్యం స్వామిని స్మరిస్తూ, ఉపవాసాలు కొనసాగించారు....

ఈలోగా క్రమంగా ఇంట్లో పరిస్థితులు మారుతూ వచ్చాయి. నాగరాజారావు. తమ్ముడొకడికి ఉద్యోగం వచ్చింది. ఆ మరుసటి సంవత్సరం ఆ ప్రాంతంలో ఒక నీటిపారుదల పథకం అమల్లోకి వచ్చి, నాగరాజారావు పొలాల్లోకి సాగునీరు ప్రవహించింది. రెండు, మూడు సంవత్సరాల కాలంలో వాళ్ళ బీడు భూముల్లో సేద్యం ఆరంభమైంది. వేసిన పంటలన్నీ సత్ఫలితాలనిస్తూ వచ్చాయి... మెరుగుపడిన ఆర్థిక పరిస్థితితో బంగారు కాసుల సేకరణ ఉద్యమం పుంజుకుంది... ఆరంభించిన 16 సంవత్సరాలకి వాళ్ళ దీక్ష ముగింపుకొచ్చింది. 108 కాసులహారం తయారయింది. ఉపవాసాలతో పొదుపు చేసిన సొమ్ము, పంటలమీద ఆదాయంలో ఖర్చులు పోగా మిగిలిన సొమ్ము.... అలా అలా వాళ్ళు జీవించడం కోసం తిన్నది మినహా, మిగతా ప్రతి రూపాయిని పోగుచేసి, అణువణువునా పొంగిపొర్లే భక్తిభావంతో ఆ రూపాయల్ని బంగారు కాసులుగా మార్చి శ్రీవారికి కానుకగా సమర్పించుకొనే ముహూర్తం వచ్చిన రోజున మరోసారి తిరుమలేశుడు నాగరాజారావు కలలో దర్శనమిచ్చాడు. "అంతా కలిసే తయారు చేశారుగా హారాన్ని. మరి, అంతా కలిసే కొండకి వచ్చి, నా ముడుపు చెల్లించుకోరా! మీ హారంలో నన్ను దర్శించుకోరా?" అని స్వామి వారు కోరారు. ఇంకా

విచిత్రం "మీకేమైనా ఇబ్బంది వస్తే 'ఈ వ్యక్తిని' కలుసుకోండి" అని చెబుతూ స్వామి వారు ఒక మనిషిని చూపించి అంతర్ధానమయ్యారు.

... అంతా విన్నాను. శ్రీనివాసుడిపట్ల అనిర్వచనీయమైన నిర్మలమైన ఆ భక్తి, స్వప్నంలో స్వామి వారి చెప్పినట్లు అనిపించిన పలుకులపట్ల అచంచలమైన విశ్వాసం, ఆయన చెప్పినట్లు చేసి తీరాలన్న ఆరాటం - నాగరాజారావు కుటుంబ సభ్యుల మొహాల్లో ప్రస్ఫుటంగా కనుపిస్తోంది. అప్పటికే భక్తికీ, దారిద్ర్యానికీ మధ్య దూరాన్ని ఛేదించుకుంటూ 16 సంవత్సరాలు సుదీర్ఘ ప్రయాణం చేసి, శ్రీవారి కానుకతో కొండకి వచ్చిన వారి దగ్గర లక్కపల్లి తిరిగి వెళ్ళటానికి ఖర్చులకి సరిపడే సొమ్ము మాత్రమే మిగిలిందిట... ఇలా చెబుతున్న నాగరాజారావుకి ఒక్కసారిగా ఏదో స్ఫురించింది. మరుక్షణం ఆర్ద్రత, ఆనందం నిండిన కంఠంతో - "మీరే, మీరే, నాకు కలలో వేంకటేశ్వరస్వామి చూపించిన వ్యక్తి. మిమ్మల్నే కలుసుకోమని చెప్పాడు..." అంటూ నాగరాజారావు ఉద్వేగంతో నా చేయి పట్టుకొని ఊపేశాడు. నా కళ్ళు చెమ్మగిల్లాయి.

వారి పరిస్థితి అర్థమైంది. ఆ కాసులహారాన్ని స్వామి వారికి అలంకరింపజేయటానికి నిబంధనల ప్రకారం కావలసిన 'వర్తన' ఇచ్చే స్తోమతు లేదు సరికదా, అభిషేకానంతరం దర్శనం చేయటానికి చెల్లించాల్సిన రుసుము చెల్లించే పరిస్థితి కూడా వారికి లేదు. వారికి ఉన్నదల్లా ఒక్కటే "శ్రీనివాసుడు చెప్పినట్లు చేశాం. కనుక, ఆయన అభీష్టం నెరవేరేలా ఆయనే చూస్తాడు." అన్న అపారమైన నమ్మకం.

... నా హృదయాంతరాళాల్లో నాకు అంతపట్టని స్పందన. నాకు తెలీకుండా నా కంటి నుంచి బాష్పాలు. ఏం జరుగుతోందో తెలీదు. ఎందుకిలా జరుగుతోందో అర్థంకాలేదు. కాని ఆ కొండమీద వెలిసిన స్వామిపట్ల వారికి గల విశ్వాసానికి న్యాయం చేయాల్సిన బాధ్యత - ఆ స్వామి సేవకుడిగా నా మీద వుందని మాత్రం స్పష్టంగా తెలుస్తోంది. నిబంధనల ప్రకారం వర్తన అడుగుదామా అంటే కనీసం రెండు లక్షల రూపాయలకి పైగా (ఆ హారం విలువని బట్టి) వాళ్ళు చెల్లించాల్సి వుంటుంది. పోనీ వర్తన లేకుండా, హారాన్ని స్వామి వారికి అలంకరింపజేద్దామా అంటే, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్కి అలాంటి విచక్షణాధికారాలు లేవు. విధ్యుక్త ధర్మానికీ - విశ్వాసాల విలువలకీ మధ్య అదొక సంఘర్షణ. కానీ వారి మొహాల్లో ఆ భక్తీ, ఆవేదన, ఆరాటం, 16 సంవత్సరాల శ్రమ ఫలితంగా దక్కుతుందనుకొంటున్న మధుర క్షణంకోసం ఆర్తితో ఎదురుచూపులు చూస్తుంటే - 'వీలుపడదు' అని చెప్పలేకపోయాను.

వారి విశ్వాసం వమ్ముకాకుండా వారికి సహాయపడటమే న్యాయం అనిపించింది. వారికీ, వారి స్వామికీ మధ్య - వాళ్ళు వుందనుకొంటున్న అనుబంధాన్ని లేదనటానికీ, వున్నా దాన్ని నిరాకరించటానికీ మధ్యలో నేనెవర్ని? అక్కడ నా ఉద్యోగం - ఆయనకీ, ఆయన భక్తులకీ నిష్కల్మషంగా సేవ చేయటమే గదా!... - ఈ ఆలోచనలు

రావటమే ఆలస్యం - నేను పేష్కార్కి ఆదేశాలిచ్చాను - వారి కోరిక ప్రకారమే కానీయండి. 'వర్తన' చెల్లింపునుండి వారిని మినహాయించండి.

ఆ ప్రకారం ఆ మర్నాడు అభిషేకం తరువాత స్వామివారిని ఆ కాసుల హారంతో అలంకరించారు. ఆ కుటుంబమంతా 'గోవిందా' అనుకుంటూ తనివితీరా స్వామివారిని వీక్షించారు. ఆ క్షణంలో వాళ్ళ కళ్ళల్లో తొణికిసలాడిన ఆనందం, భక్తిపారవశ్యం... ఏమని వర్ణించగలను!

... ఆ తరువాత కొన్ని రోజులకి జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో నేను చేసిన 'నిబంధనల ఉల్లంఘన' గురించి వివరించాను. పర్యవసానం ఎలా వుంటుందో తెలీకపోయినా, ఎలాంటి పర్యవసానానికైనా సిద్ధపడి వున్నాను. అయితే బోర్డు సభ్యులంతా దైవచింతనగల వాళ్ళే కావడంతో, నాగరాజారావు భక్తిగాథ వారిని కూడా కదిలించివేసింది. వెంటనే బోర్డు ఆ కాసులహారం విషయంలో నేను తీసుకున్న చర్యకి ఆమోదముద్ర వేసింది. అంతేకాదు, "భవిష్యత్తులో ఇలా ఎవరైనా పేద భక్తులు ఇవ్వదలచిన బహుమానాల విషయంలో కూడా 'వర్తన'కి మినహాయింపు ఇవ్వాలి" అని కూడా తీర్మానించింది.

నాకిప్పటికీ అంతుపట్టని ప్రశ్నలలో ఇది కూడా ఒకటి. ఎందుకలా జరిగింది? ఏ శక్తి నాగరాజారావుకి కాసులహారం చేయించమని ప్రేరణ కలిగించింది, తదనుగుణంగా నిర్ణయం తీసుకునేలా నాకు శక్తినిచ్చింది?.

★★★

# ఏడోమైలురాయిలో హత్య

తిరుమల కొండకి వెళ్ళే కాలిబాటలో 1979లో ఒక స్త్రీ హత్య జరిగింది! ఈ వార్త వినగానే టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నేను హుటాహుటిన హత్యా స్థలానికి చేరుకున్నాను.

కొండకి నడిచి ఎక్కటమనేది అనాదిగా శ్రీ వారి పాదదర్శనం కోసం భక్తులు అనుసరిస్తున్న పథం. శ్రీనివాసుని మీద భక్తితో నెలలు, సంవత్సరాల తరబడి ముడుపులు కట్టుకుని, ఎన్నో మైళ్ళదూరం నుంచి రైల్లోనో, బస్సులోనో తిరుపతికి వచ్చినా, అక్కడ్నుంచి మూటాముల్లె నెత్తిన పెట్టుకుని 3200 అడుగుల ఎత్తునున్న తిరుమల కొండలో శ్రీ వేంకటేశ్వరుని చేరుకునేదాకా "గోవిందా, గోవిందా" అనుకుంటూ, ఆ స్వామి స్మరణతో నడకలో కష్టాన్ని మర్చిపోతూ, తొమ్మిది కిలోమీటర్ల దూరం - భార్యా పిల్లలతో ఆపసోపాలు పడుతా భక్తులు నడిచివెళ్ళే మార్గంలో - ఈ హత్య జరగటం నన్ను ఒక్కసారిగా కుదిపేసింది. వార్త విన్నప్పుడు నిర్ఘాంతపోయాను. కాని హత్యా స్థలానికి వెళ్లి చూశాక, దిగులుపడిపోయాను. మనసంతా కకావికలమైపోయింది.

ఎందుకంటే - కొండకి పాదచారులై భక్తులు వెళ్ళేదారిలో ఏడో మైలురాయి దగ్గర జరిగిందీ సంఘటన. చుట్టూ అడవి. నడిచేదారిలో ఎగుడు దిగుడు రాళ్ళు. రాత్రయితే - అక్కడక్కడా వెలిగే లైట్లు మినహా దారంతా చీకటి. చీకటి పడినకొద్దీ తగ్గిపోయే జనసంచారం. హత్య, అలాంటి ఏ నేరం జరగటానికైనా అనువుగా వుండే వాతావరణం అక్కడ కనుపిస్తోంది. నిజానికి ఇలాంటి హత్యలు దేశంలో ఎన్ని జరగడంలేదు. జరుగుతున్నాయి. కాని తిరుమల కొండకి వెళ్ళేదారిలో జరగటమేమిటి?

కొండకి బస్సులు వెళ్ళే ఘాట్ రోడ్ల నిర్మాణం జరిగిందగ్గర్నుంచి, పాదచారుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. అందుక్కారణం - ఈ నడిచే దారిలో అభద్రతా వాతావరణం. పైగా పగలు ఎండకి కాళ్ళు కాలుతుంటాయి. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నాక నేను తీసుకున్న మొదటి నిర్ణయం ఏమిటంటే కొండకి నడిచి వెళ్ళే దారిలో సదుపాయాలు బాగా పెంచాలి. నడిచి కొండకి ఎక్కడం అనేది ఒక విహారయాత్రకి వెళ్ళినంత ఉల్లాసపూరితంగా వుండేలా పరిసరాలలో మార్పులు తీసుకురావాలి. అలా చేయాలంటే, ముందు అసలు కాలిబాటలో అవసరాలేమిటో బాగా అవగతం చేసుకోవాలి.

ఇలా అనుకున్నాక, ముందు నేనే కనీసం నెలకొకసారయినా కొండకి భార్యాపిల్లలతో నడిచి ఎక్కాలని తీర్మానించుకున్నాను. అలా ఆ మూడు నాలుగు గంటలూ కుటుంబమంతా కలిసివుంటాం. ఇందులో పుణ్యం, పురుషార్థం కలిసొస్తాయి గదా!

వీలైనప్పుడల్లా అలా నడిచి వెళ్తూనే వున్నాం. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హోదాలో నేను నడుస్తున్నాను. కనుక నాతోపాటు టిటిడిలో కొందరు ఇతర అధికారులు కూడా నడిచేవారు. క్రమంగా కాలిబాటలో సమస్యలు అర్థమవుతూ వచ్చాయి. అందుకు తగినట్లుగా సదుపాయాల్ని మెరుగుపరుస్తూ వచ్చాం.

ఎగుడు దిగుడుగా వుండే రాళ్ళ మెట్లన్నీ సరి చేయిస్తూవచ్చాం. దారిపొడవునా త్రాగునీటి సదుపాయాన్ని మెరుగుపరిచాం. పరిసరాలు మరీ దట్టమైన అడవిలా లేకుండా చేశాం. వీలైనంత దగ్గర దగ్గరగా లైటింగ్ ఏర్పాటుచేశాం. మధ్యమధ్యలో స్వామివారి నామస్మరణను గుర్తుచేసే బోర్డులు పెట్టాం.. ఇవన్నీ చేశాక "చాలాచేశాం" అనుకున్నాను. అయినా నేను కొండకి నడిచి ఎక్కినప్పుడల్లా చూస్తున్నాను - నడిచి వెళ్ళే భక్తుల సంఖ్యలో చెప్పుకోదగ్గ పెరుగుదల లేదు... నాకు అర్థం కాలేదు.

మళ్ళీ అధ్యయనం సాగించాను. ఒకసారి నేను కొండకి నడిచి వెళ్తున్నప్పుడు - ఒక భక్తుల కుటుంబం ఆయాసపడుతూ కొండెక్కుతోంది. మొక్కుతో వచ్చినట్లున్నారు. కుటుంబ పెద్ద - శిరోజాలు, గడ్డం పెంచుకున్నాడు. నెత్తి మీద మూటలు, చంకలో సంచీలు, వెనకాల భార్య చంకలో పెట్టె, ఇంకా, పెద్ద పిల్లవాడనుకుంటాను - చంటిపిల్లణ్ణి చంకలోనూ, భుజాల మీద మార్చి మార్చి మోస్తున్నాడు. ఆ బరువులతో ఎక్కలేక

ఎక్కలేక అవస్థపడుతూ, "వడ్డీకాసులవాడా, గోవిందా, గోవిందా" అనుకుంటూ ఎక్కుతున్నారు. చెమటలు కక్కుతున్నారు. ఆయాసపడుతున్నారు, ఆ శ్రమ మర్చిపోవాలని గోవిందుణ్ణి పిలుస్తున్నారు. ఇదంతా శ్రీనివాసుడి దర్శనం కోసమే కదా! శ్రీనివాసుడికి వినబడుతుందా ఈ పిలుపు??-- ఇలా అనుకోగానే నాకనిపించింది - వాళ్ళ ఈ గోవింద నామస్మరణను సామాన్లు మోయడం వల్ల కలిగే శ్రమను మర్చిపోవడం కోసం చేసే ప్రయత్నంగా కాక, ఉల్లాసంగా ఉత్సాహంగా భక్తితో చేసే శ్రీనివాసుని అర్చన స్మరణగా ఎందుకు చేయకూడదు? అప్పుడు కలిగిన ఆలోచనే - నడిచి వెళ్ళే భక్తులకు సామాను మోత భారం లేకుండా చేయటం. ఆ ఐడియాని వెంటనే అమల్లో పెట్టాను. కొండకి నడిచి వెళ్ళే భక్తులు తమ సామానంతా కాలిబాట ప్రారంభంలోని అలిపిరి వద్ద టోల్ గేటులో గాని, సత్రాలలోగాని డిపాజిట్చేస్తే, ఆ లగేజిని టిటిడి వారే తమ వాహనాల్లో కొండపైకి ఉచితంగా చేరుస్తారు. మూడు నాలుగు గంటల తరువాత భక్తులు కొండెక్కేసరికి అక్కడ వాళ్ళ సామాను భద్రంగా వుంటుంది. నిజానికి గతంలో కొంతమంది భక్తులైతే బస్సులో కొండెక్కి, సామాను సత్రంలో పెట్టి, బస్సులో కిందకు వచ్చి, కొండకి నడిచి ఎక్కేవాళ్ళు - కేవలం నడిచి ఎక్కామన్న సంతృప్తి కోసం, లేదా మొక్కు తీర్చుకోవడంకోసం.

నేనిలా ఉచిత లగేజి సదుపాయం కల్పించడంతో నడిచే భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అయినా - స్త్రీ హత్య జరిగిన రోజు నాలో ప్రారంభమైన అలజడి తగ్గలేదు. ఇంకా ఏదో జరగలేదన్న భావన, ఇంకా ఏదో మిగిలిపోయిందన్న వెలితి నన్ను వెంటాడుతూ వచ్చాయి.

మరోసారి నడిచి ఎక్కేటప్పుడు, దారి మధ్యలో వుండగా అకస్మాత్తుగా వర్షం వచ్చింది. నడుస్తున్న భక్తులంతా దగ్గరలో వున్న చెట్ల క్రిందకు పరుగెత్తారు. అక్కడక్కడ గోపురాలు వున్నా - అవి చాలా దూరంలో వున్నాయి. నేను అలా తడుస్తూనే ముందుకెళ్తున్నాను. - "ఈ వర్షం ఎప్పుడు వెలుస్తుందో? బాలాజీ దర్శనం ఎప్పుడు చేసుకుంటామో... ?" అంటూ ఓ భక్తుల గుంపు చెట్టుక్రింద నిలబడి తడిసీ, తడవకుండా అవస్థపడుతూ చిరాకుపడుతున్నారు. వాళ్ళల్లోంచి ఒకడు శ్రీనివాసుడికి ఒక ఛాలెంజ్ విసిరాడు - "మేం నిజమైన భక్తులమైతే, మాకోసం ఒక గొడుగు పంపించవయ్యా బాలాజీ..." అంటూ. అవును, నడిచి ఎక్కే భక్తులకోసం దారంతా గొడుగుమయమే అయితే... ! ఈ ఆలోచన వచ్చిందే తడవుగా నేను టిటిడి బోర్డులో ఒక ప్రతిపాదన ప్రవేశపెట్టాను. ఈ ప్రతిపాదనలో కాలిబాట పొడవునా సిమెంట్ షెల్టర్ ఏర్పాటు చేయాలి. బాలాజీ దర్శనం కోసం నడిచి వెళ్ళే భక్తుడికి ఎండ, వానల నుంచి శాశ్వత రక్షణ కల్పించాలి.

ఈ ప్రతిపాదన విని మా బోర్డు సభ్యులు నవ్వుకున్నారు. "ఏమిటండీ ప్రసాద్ గారు, మీకేమన్నా వెర్రా? మామూలుగా సాఫీగా వున్న రోడ్డు మీద షెల్టరు వెయ్యటమే

కష్టం. ఎగుడుదిగుడుగా వున్న ఎనిమిదిన్నర కిలోమీటర్ల తిరుమల పుట్పాత్లోకి సిమెంటూ, ఇసుక ఎలా మోసుకెళ్తారు. షెల్టరు ఎలా కడ్తారు? ఇది జరిగేదేనా..." అంటూ పరిహాసం చేశారు. వాళ్ళ ఉద్దేశ్యం నన్ను వేళాకోళం చేయటంకాదు. కాని అసాధ్యమైన ప్రతిపాదన చేశానన్న అభిప్రాయం. నాకు మాత్రం - వర్షంలో తడుస్తూ "బాలాజీని గొడుగుపంపమని" అడిగిన భక్తులే గుర్తొస్తున్నారు. "భక్తులకి గొడుగు పంపాలి" అని బాలాజీ అనుకుంటే అది జరగదా అన్న ఆశ. ఆ ఆశతోనే నేను పట్టుదల వదలకుండా బోర్డులో నచ్చజెప్పే ప్రయత్నం చేశాను. అనేకసార్లు చర్చజరిగింది. చివరకి బోర్డు ఆమోదించింది - మొదటి దశలో అలిపిరి నుంచి శ్రీవారి నామాలు కనుపించే గోపురం దాకా షెల్టరు నిర్మించటానికి.

అంతే! బాలాజీ భక్తుల కోసం 'శాశ్వత గొడుగు' నిర్మాణం ప్రారంభమైంది. కాని అది ఒక్క రోజులోనో, నెలలోనో పూర్తయ్యేపనికాదు. అందుకని, ఈ లోపల దీనితో పాటే, కాలిబాటలో ఎగుడు దిగుడుగా వున్న మెట్లఎత్తు వీలైనంత తక్కువ చేస్తూ, రాళ్ళన్నీ మళ్ళీ పేర్చుకుంటూ వెళ్తామన్నాను. బోర్డు ఒప్పుకుంది, అదీ ఆరంభించాం. మెడిసిన్ చదివి, సాంఘిక సేవలో ఆసక్తితో పనిచేసే డాక్టర్ జనార్ధన నాయుడ్ని టిటిడిలో సెక్యూరిటీ - విజిలెన్స్ ఆఫీసర్గా నియమించి, ఈ కాలిబాట భద్రతకు శ్రద్ధవహించమని చెప్పాను. అతను చొరవ తీసుకుని ఉత్సాహంగా ప్రతిమైలుకి ఇద్దరు సెక్యూరిటీగార్డుల్ని 'ప్రతి షిఫ్టుకి' ఏర్పాటు చేశాడు. పాత లైటింగ్ ఏర్పాట్లు మార్చేసి కాంతివంతమైన కొత్త లైట్లు వీలైనంత దగ్గరగా వేశాం. దారంతా పరిశుభ్రమైన తినుబండారాలు దొరికేలా చర్యలు తీసుకున్నాం. మధ్య మధ్యలో భక్తులు వండుకొని తినడానికి వీలుగా షెల్టర్ల సదుపాయం కల్పించాం. దారి మధ్యలో భక్తుల్ని ఆకర్షించడం కోసం, కొంత మానసికోల్లాసం కల్పించటం కోసం జింకల పార్కు ఏర్పాటుచేశాం. దారి పొడవునా మ్యూజిక్ సిస్టం పెట్టించి, శ్రీవారి భక్తి సంగీతఝురి నిరంతరం ప్రవహించేలా చేశాం. అసంపూర్తిగా వున్న గోపురాలు పూర్తిచేశాం.... అద్భుతం! అంతకు ముందు నాలుగైదు వందల మంది నడిచే దారిలో ఇప్పుడు నాలుగైదు వేలమంది నడుస్తున్నారు ప్రతిరోజు.... ఇంత చేసినా, హత్య జరిగిన నాటి ఆందోళన నాలో తగ్గలేదు. ఇంకా ఏదో మిగిలిపోయింది, ఇంకా ఏదో జరగలేదన్న చింత నన్ను వెంటాడుతోంది.

మరోసారి కొండ మీదకెళ్తూ, నడిచి వచ్చే భక్తులు క్రింద డిపాజిట్ చేసిన లగేజిని, వారికి తిరిగి అప్పగించే క్లోక్ రూమ్ దగ్గరకి వెళ్లాను. అక్కడి దాకా ఉచితంగా టిటిడి వ్యాన్లోలో లగేజి వచ్చినా, భక్తులు అక్కడ్నుంచి మళ్లీ వాళ్లకి సత్రాల్లో రూమ్లు దొరికి, ఆ రూమ్లకి చేరేదాకా లగేజి మోసుకువెళ్లటం తప్పడం లేదు... దాని కోసం ప్రైవేటు కూలీల దోపిడీ. "వెంకటేశూ, (అలాంటి పేరేఏదో) ఈ సామాను నువ్వు మోసుకురారా" అంటూ ఓ పెద్దాయన తన కొడుక్కి లగేజి అప్పగిస్తుంటే విన్నాను.... ఇన్ని వేల మంది భక్తుల నుంచి ముడుపుల రూపంలో కోట్లు తీసుకుంటున్న వెంకటేశుడు

ఆ మాత్రం లగేజి మోసే ఏర్పాటు చేయలేడా? - అనిపించింది. అలా అనిపించిన కొద్దిరోజుల్లోనే కొండమీద ఎక్కడ్నుంచి ఎక్కడికైనా ఉచిత బస్సులో భక్తులు లగేజిలతో ప్రయాణించే సదుపాయం కల్పించాను. (ఎవడు కల్పించాడు? నేనా? ఎక్కడిదా ప్రేరణ?) ప్రతి 15 నిమిషాలకోసారి అలా ఫ్రీ బస్సులు తిరుగుతూనేవుంటాయి.

..... అయినా, స్త్రీ హత్యనాటి దిగులు నన్ను పట్టుకునేవుంది. ఇంకా ఏం చేయాలి? తెలీదు. కానీ ఏదో జరగాలి. ఏమిటిదీ? ఏమిటిది? ఎవరు చెబుతారు నాకు? “స్వామీ! నీ భక్తుల సేవకోసం ఇక్కడికి వచ్చాను. ఏం చేయాలో చెప్పు చేస్తాను - ఏమిటి నాకీ వేదన... ఎంతకాలం?” - ఇలా ఒకరోజు ఆ హత్యజరిగిన చోట నిలబడి ప్రార్ధన చేశాను. ఆ మర్నాడు, లేదా దానికి మర్నాడు ఓ అద్భుతం జరిగింది!!

★★★

నేను నా భార్య గోపిక, పిల్లలు మాధవి, సంజీవ్లలతో కలిసి కాకినాడకి కారులో బయల్దేరాను. నెల్లూరు, విజయవాడ, కాకినాడలో నిర్మాణంలో వున్న కళ్యాణమండపాలన్నీ ఇన్ స్పెక్షన్ చేసుకుంటూ కాకినాడలో చివరి మజిలీ చేయాలన్నది మా కార్యక్రమం. (కాకినాడ గోపిక పుట్టిల్లు.)

ఆ రోజు రాత్రి విజయవాడలో బసచేశాం. మర్నాడు ప్రొద్దుటే బయల్దేరాం. నిర్ణీత కార్యక్రమం ప్రకారం 11 గంటలకల్లా మేం కాకినాడ చేరిపోవాలి. కాని రాజమండ్రి చేరేసరికి ఒంటిగంటయింది. పిల్లలకి ఆకలేస్తోంది. రాజమండ్రిలో గోదావరి పుష్కరాల కోసం టిటిడి స్నానాల ఘాట్ కడ్తున్నాం.

ఆ ఇన్ స్పెక్షన్ ఎంత త్వరగా ముగించుకున్నా, భోజనం వేళ దాటిపోయింది. కాకినాడలో మాకోసం మామగారి కుటుంబం ఎదురుచూస్తూంటుంది. కాబట్టి సహజంగానే గోపిక చాలా అసహనంగా వుంది. “సరే, సరే, వెళ్లిపోదాం, వెళ్లిపోదాం” అంటూ డ్రైవర్ని “పోనీవయ్యా” అంటున్నాను. అలా అలా పెద్దాపురంలోంచి వెళ్తుంటే అక్కడ 12 అడుగుల ఎత్తున్న ఒక ఆంజనేయస్వామి విగ్రహం కనుపించింది. “డ్రైవర్, కారాపు” అన్నాను. ఆపేశాడు.

ఏదో అనిర్వచనీయమైన దివ్యశక్తి నన్ను ఆ విగ్రహం వైపు ఆకర్షించింది. అప్రయత్నంగా, కారు దిగి ఆ విగ్రహం వైపు నడిచాను. ఆశ్చర్యం! అప్పటిదాకా చిర్రుబుర్రులాడుతున్న గోపిక కూడా నాతోపాటే ఆ విగ్రహాన్ని చూస్తూ ఆ అందానికి ముగ్ధురాలైపోయి, “ఎంత బాగుందో కదండీ” అనకుండా వుండలేకపోయింది. ఓహ్! ఏం సౌందర్యం! ఏం వర్చస్సు? క్రమంగా మనస్సులో ఏదో మూల వెతుకుతున్నదేదో దొరుకుతోందన్న భావన తాలూకు ప్రకంపనాలు... అదేమిటో తెలీటంలేదు కాని....! అప్పటికప్పుడు ఈ విగ్రహం చేసిన వ్యక్తి గురించి ఆరా తీశాను. అతని పేరు తోగు లక్ష్మణస్వామి. అతను పెద్దాపురం సమీపంలోని ఓ కుగ్రామంలో వుంటాడుట. “గోపికా,

ఈ కళాకారుడ్ని ఇప్పుడే చూడాలనుందయ్యా”, సంశయిస్తూనే అన్నాను. “పదండి చూద్దాం.....” అంటూ నాకన్నా ఉత్సాహంగా గోపిక చొరవ తీసుకుంది. మరుక్షణంలో మా కారు ఆ గ్రామాన్ని వెతుక్కుంటూ గతుకుల రోడ్డులో మరో గంట ప్రయాణం చేసింది.

అక్కడ ఒక చిన్న గుడిశెలో యాభయ్యోపడిలో వున్న లక్ష్మణస్వామి విగ్రహాలు చేసుకుంటున్నాడు. అంత మధ్యాహ్నం వేళ ఎండలో వచ్చిన మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయాడు. “లక్ష్మణస్వామీ! పెద్దాపురంలో మీరు చేసి హనుమాన్ విగ్రహంలాంటి విగ్రహాలు తిరుపతిలో కూడా పెట్టించాలంటే, మీరు అక్కడికి వచ్చి చేయగలరా?”

“మీరెవరు?”

“నేను టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ని” -

లక్ష్మణస్వామి ఆనందానికి అవధుల్లేవు. శ్రీరాముడే ఒకదూతని పంపించి, “నేనిక్కడున్నాను రావయ్యా” అంటే లక్ష్మణుడు ఎంతటి గౌరవప్రపత్తులతో ఎగిరిగంతేస్తాడో - అంతటి ఉద్వేగంతో, సంభ్రమాశ్చర్యాలతో పులకించిపోయాడు లక్ష్మణస్వామి. కాని అతను ఎన్నడూ ఆ పరిసరగ్రామాలు దాటి బైట ప్రపంచంలో విహరించిన నాగరీకుడు కాడు. అందుకే అతను తన ఇద్దరు సహాయకులతో కలిసి తిరుపతి వచ్చివుండటానికి, మాకు కావలసిన విగ్రహాలు చేయటానికీ ఏర్పాట్లు నేను స్వయంగా చేస్తానని హామీ ఇచ్చి, కారెక్కాను. క్రమంగా మనసు స్థిమితపడుతోంది... మా భోజనాలు ఆ రోజు సాయంత్రం అయిదుగంటలకయ్యాయి - కాకినాడలో.

★★★

తిరుపతికి తిరిగి రాగానే - అంకితభావంతో పనిచేసే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వైఖానసాచారిని, అసిస్టెంట్ ఇంజనీర్ బెల్లం వెంకట్రామయ్యని పిలిపించి, లక్ష్మణస్వామికి కావలసిన ఏర్పాట్లు చేసే బాధ్యత అప్పగించాను. లక్ష్మణస్వామికి నేను అప్పగించిన మొదటి బాధ్యత - అప్పటికి నిర్మాణం పూర్తికావస్తూన్న టిటిడి అడ్మినిస్ట్రేషన్ భవనం (హుజూర్ ఆపీస్) ముందు ఆవరణలోని పార్కులో పెద్దాపురంలో నేనుచూసిన ఆంజనేయస్వామి విగ్రహంకన్నా పెద్ద విగ్రహ నిర్మాణం. సిమెంటుతో విగ్రహం నిర్మించి, దానికి మొజాయిక్ పూత పూయటం ద్వారా దీర్ఘకాలం నిలిచేలా చేయటం శ్రీ స్వామి విధానం. ఎంత పెద్ద విగ్రహం చేసినా. వేలాడే జులపాల వంటి అతి సూక్ష్మ మైన భాగాలను కూడా అత్యంత సహజంగా కళాత్మకంగా రూపొందించడం లక్ష్మణ స్వామి నైపుణ్యంలో విశిష్టత.... ఇంకా, గరుడాద్రి, అంజనాద్రిలకు తగినట్లుగా గరుడ, ఆంజనేయ విగ్రహాలు కూడా చేయమని కోరాను. గరుడాద్రి అంటే క్రింద అలిపిరి నుంచి

పైకి చూస్తే కనుపించే కొండ. మరి అంజనాద్రి ఎక్కడుంది? తెలీదు. కానీ "చేసేయండి. తరువాత చూద్దాం" అన్నాను.

ఈ- పనులు తిరుపతిలో జరుగుతుండగా - ఒక రోజు నేను తిరుమలకి నడిచి వెళ్తున్నాను. యధాలాపంగా ఏడోమైలురాయి దగ్గర - గతంలో హత్య జరిగినచోట - ఆగిపోయాను. మళ్లీ పాత వ్యధ పైకి తన్నుకొస్తోంది. ఏదో సమాధానం కనుపిస్తున్నట్లే అనిపిస్తోంది, కానీ అదేమిటో తెలీటం లేదు. గట్టిగా కళ్లు మూసుకుని ధ్యానం చేసుకున్నాను.... నా కళ్లలో మెదిలిన ఒకే ఒక రూపం - పెద్దాపురం ఆంజనేయస్వామి! ఓహ్, దొరికిపోయింది పరిష్కారం. ఆనందంతో ఎగిరి గంతేయాలనిపించింది. పదేళ్ల కుర్రాడిలా ఉత్సాహంగా ఉరకలు వేయాలనిపించేలా నాలో అణువణువూ స్పందించింది.

ఆ తరువాత పండితులతో చర్చిస్తే చెప్పారు భవిష్యపురాణం. - మాతంగముని ఆదేశాల మేరకు అంజనాదేవి, కేసరి - నారాయణగిరికి వచ్చి పన్నెండేళ్లు తపస్సు చేశాక, వాళ్లకి కలిగిన సంతానమే ఆంజనేయస్వామి.

**పమ్పాయాః పూర్వా దిగ్భాగే పఞ్చశద్యోజనాన్తరే|**
**నారసింహాశ్రమం దేవి వర్తతే వసుధాతలే ||**
**తస్య దక్షిణదిగ్భాగే నారాయణ గిరే స్తటే |**
**ఉత్తరే స్వామితీర్థస్య వర్తతే క్రోశమాత్రకే ||**
**వియద్గజేతి విఖ్యాతా తత్ర గచ్ఛయథాసుఖమ్|**
**తత్రస్నాత్వా థ కళ్యాణి ద్వాదశాబ్దం తప శ్చర ||**
**తేన పుణ్యేన పుత్రో భవిష్యతి గుణాధికః |**
**మతగ్గే నైన ముక్తాసా నారాయణగిరిం యయో||**
**హనూమన్త మిమం ప్రాహుః మునయో వీతకల్మషా**
**అఞ్జనా వ్రత మాస్థాయ పుత్రం ప్రాప గిరీశ్వరే**
**తస్మా దఞనశై లోయం లోకే విఖ్యాతకీర్తిమాన్**

ఆలస్యం చేయకుండా లక్ష్మణస్వామికి ఏడోమైలురాయి దగ్గర ఆ స్థలాన్ని చూపించాం. ఆ ప్రకృతి అందాలకి పరవశించిపోయాడు లక్ష్మణస్వామి. "అయ్యా! ఇంత సుందరమైన కొండమీద భక్తులకు అండగా వుండే హనుమాన్ విగ్రహాన్ని నాశక్తినంతా ధారపోసి రూపొందిస్తాను. నా జన్మ సార్ధకం చేసుకుంటాను..." అన్నాడు లక్ష్మణస్వామి భక్తిపారవశ్యంతో. అలా అతని కళాత్మక హస్తాలనుండి జాలు వారిందే ఇప్పుడు ఏడో మైలురాయి దగ్గర భక్తులు చూస్తున్న ఎత్తైన ఆంజనేయస్వామి విగ్రహం. ఇంకా విచిత్రం ఏమంటే - నాకు స్ఫురించిన ఆ స్థలంలోనే కార్లు వెళ్లే ఘాట్ రోడ్డు,

కాలిబాట - రెండూ కలుస్తాయి. అంటే, తిరుమల కొండమీద శ్రీనివాసుడ్ని దర్శించటానికి భక్తులు ఎలా వెళ్లినా, దారిలో ఏడో మైలురాయి దగ్గర అంజనీ పుత్రుడి దర్శనం అనివార్యం.

అలా 1980లో అక్కడ భద్రాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగాకే - అంతకాలం (హత్య జరిగిననాటినుంచి) నన్ను వెంటాడిన వెలితి, వేదన మటుమాయమైపోయాయి!

**బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వం అరోగతా**

**అజాడ్యం వాక్పటుత్వంచ హనుమత్ స్మరణాత్ భవేత్||**

తిరుమల ఆలయం చేరుకునేదారిలో వున్న సప్తగిరుల మీదా - (వెంకటాద్రి, గరుడాద్రి, శేషాద్రి, అంజనాద్రి, వృషభాద్రి, నారాయణాద్రి, ఆనందాద్రి) అలాంటి ఏడు విగ్రహాలు ఆయారూపాలతో ఏర్పాటు చేయాలని కోరిక వుండేది కానీ.....

★★★

# నవరత్నాలు - సుబ్బారావు

సినిమా డిస్ట్రిబ్యూటర్ సుబ్బారావు దంపతులు నాలుగైదు గంటలు కాపలాకాసి, ఒక అర్ధరాత్రివేళ తిరుమలకొండ మీద గెస్టవుల్లో నన్ను పట్టుకున్నారు. అప్పటికే శక్తి, సహనం చచ్చిపోయి, మెదడు వేడెక్కిపోగా, దారీతెన్నూ తెలీని సంక్లిష్ట పరిస్థితిలో తల బాదుకుంటున్న నన్ను వాళ్లు వదల్లేదు.

"రేపు ఆఫీసులో కలుద్దాం లెండి" - అంటున్నా వినకుండా వాళ్లిద్దరూ నన్నూ, నా భార్య గోపికనీ గెస్టవుస్ వరండాలో నిలబెట్టి ఒక కథ వినిపించారు... ఆ కథ వింటూనే నాకూ, నా భార్యకీ కళ్లవెంట ఆనందబాష్పాలు రాలాయి!!

★★★

నేను తిరుమల - తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా వుండగా, 1982లో తిరుమల కొండమీద శ్రీవారి ఆలయంలో కొత్త ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. అదే సమయంలో ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణం, సన్నిధివీధి మాడావీధుల విస్తరణ, ఆనంద నిలయం విమానంపై స్వర్ణకవచానికి మెరుగు పెట్టడం, పుష్కరిణి క్షాళన, పోటు (వంటశాల) పునర్నిర్మాణం, బలిపీఠం పునరుద్ధరణ వంటి చాలా కార్యక్రమాలను కూడా చేపట్టడం జరిగింది. 1982 ఫిబ్రవరిలో ఈ కార్యక్రమాలన్నింటినీ మొదలు పెట్టి త్వరలో పూర్తిచేయాలనీ, అదే సమయంలో ఆలయంలో మూలవిరాట్ కి అష్టబంధనం (విగ్రహాన్ని పద్మపీఠంపై పటిష్టంగా వుంచేలా చేసే కార్యక్రమం) చేయాలనీ, ఈ మొత్తం కార్యక్రమం ఒకేసారి పూర్తికావాలని నిర్ణయించాం. అలాచేశాక, సంప్రోక్షణ చేస్తేనే పూర్వపు పవిత్రత

పునరుద్ధరించబడుతుందని ఆగమశాస్త్రం పేర్కొంటోంది. ఇది చాలా అరుదైన సంఘటన కావటం వల్ల, వీటి ఉత్సవాలను భారీగా జరపటానికి ప్లాన్ చేశాం. అందులో భాగంగా ఒక మినీ బ్రహ్మోత్సవం ఏర్పాటు చేశాం. సంప్రోక్షణ సహా వివిధ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వర్తించడం కోసం సుమారుగా 300 మంది ఋత్విక్కులను, వేదపండితులను ఎక్కడెక్కడ్నుంచో పిలిపించడం జరిగింది. ఒకేసారి చాలా కార్యక్రమాల్ని నిర్వహించాల్సి వుండటంవల్ల, ఆలయ సిబ్బంది కూడా చాలా వివరంగా ప్రతి అంశాన్ని ప్లాన్‌చేయడం, అందుకు కావల్సిన పరికరాల్ని, వస్తు సామగ్రిని ముందుగా సమకూర్చుకోవడం జరిగింది.

గర్భగుడిలో ఎలాంటి మరమ్మత్తులు చేయాలన్నా, ముందుగా ఆ విగ్రహంలోని ప్రాణశక్తిని ఒక కలశంలోకి ఆవాహన చేసి, ఆ కలశాన్ని పవిత్రంగా వేరేవుంచి, మరమ్మత్తులు చేస్తారు. అవి అయ్యాక విగ్రహంలోకి మళ్లీ ప్రాణశక్తిని పునరావాహన చేశాక వివిధ రకాల పదార్థాల మిశ్రమంతో విగ్రహ పీఠంచుట్టూ అష్టబంధనం చేస్తారు. అలా చేయటంతో పునఃప్రతిష్ఠ ముగుస్తుంది. ఇలా అష్టబంధనం చేసేటప్పుడు ముందుగా అష్టబంధనం జరిగే స్థలాల్లో నవరత్నాలను వుంచాలన్నది ఆగమశాస్త్ర విధానం. ఇలాంటి సంప్రోక్షణ కార్యక్రమమే ఇంకా బేది ఆంజనేయస్వామి, యోగనరసింహస్వామి తరహా ఆలయాల్లో కూడా చేపట్టడం వల్ల సంప్రోక్షణకు ముందు మొత్తం తొమ్మిది నవరత్నాల సెట్‌లు కావాలని నిర్ణయించటం, ఆ రకంగా సేకరించి పెట్టుకోవటం జరిగిపోయింది.

సరిగ్గా ఆ అష్టబంధనానికి ముందురోజు నేను టిటిడి బోర్డు మీటింగ్కి వెళ్లబోతూ, ఏర్పాట్లన్నీ సవ్యంగా జరుగుతున్నాయా అని విచారించినప్పుడు, ఒక సీనియర్ మిరాసీదార్ నాతో మరొక నవరత్నాల సెట్ కావాల్సి వస్తుందని చెప్పారు. నేను యధాలాపంగా "అదేదో పేష్కార్ (ఆలయ అధికారి)తో చర్చించండి" అని చెప్పేసి మీటింగ్కి వెళ్లిపోయాను. మా మీటింగ్ పూర్తయ్యేసరికి రాత్రి 8 గంటలు దాటింది. అక్కడ్నుంచి నేను, నా భార్య గోపికతో కలిసి స్వామివారి దర్శనం కోసం ఆలయానికి వెళ్లాం. సరిగ్గా మేం బయటకు వచ్చే సమయంలో, అర్చకులు వచ్చి నవరత్నాల సెట్స్ అన్నింటినీ అన్ని ఆలయాల్లో వాడేశామనీ, ఆ మర్నాడు జరిగే మూలవిరాట్ అష్టబంధనానికి ఒక నవరత్నాల సెట్ కావాలనీ చెప్పడంతో నేను నివ్వెరపోయాను - ఎందుకంటే పేష్కార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చెప్పిన లెఖ్ఖల ప్రకారం, ముందుగానే కావల్సిన నవరత్నాల సెట్స్‌ని సేకరించి, అర్చకులకు ఇచ్చేయడం జరిగింది. మరి ఇంకో సెట్ అవసరం ఎలా వచ్చింది? పైగా అదికూడా మూలవిరాట్ .. ఇది తెల్లవారితే అష్టబంధనం అనగా ఏర్పడిన పరిస్థితి. అప్పుడిక లెఖ్ఖల్లోకి వెళ్లాక అర్థమైంది - మధ్యలో వరాహస్వామి ఆలయంలో పునరుద్ధరణ కార్యక్రమాన్ని కొత్తగా

చేర్చడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైందని. అప్పటికి రాత్రి తొమ్మిదయింది. తెల్లవారి అయిదు గంటలకే అష్టబంధనం, మూలవిరాట్‌కి ప్రాణశక్తి పునరావాహన జరగాలి.

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కి వుండే విస్తృతమైన అధికారాల కారణంగా మరో సెట్‌ని సేకరించడం కష్టం కాదనుకొన్నాను. అందుకని ఆలయంలోనే కూర్చుని, తిరుపతిలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్కి ఫోన్ చేసి, రాత్రికి రాత్రి ట్రెజరీ తెరిపించి మరో నవరత్నాల సెట్ పంపించమని చెప్పాను. అయితే ట్రెజరీది డబుల్ లాక్ సిస్టమ్. అందులో ఒక కీ కలిగి వుండే అధికారి మద్రాసు వెళ్లాడు. ఫలితంగా, ట్రెజరీని తెరిపించలేకపోయాం.

టైమ్ పరుగెడుతోంది. రాత్రి పది కావస్తోంది. ట్రెజరీ ప్రయత్నాలు విఫలం కావడంతో, తిరుపతి పట్టణంలో వుండే జ్యుయలరీ షాపుల్లో ఏమైనా నవరత్నాల సెట్ దొరుకుతుందేమోనని గాలించమన్నాను. సిబ్బంది ఆఘమేఘాల మీద పట్టణంలో గాలింపు ప్రారంభించారు. కొన్ని జ్యుయలరీ షాపులు మూసేసి వున్నాయి. తెరిచి వున్న వాటిల్లో నవరత్నాలు లేవు. రాత్రి 11.30 కావస్తోంది. నేను నా భార్య ఆలయంలోనే కూర్చున్నాం. నవరత్నాల వ్యవహారం ఒక కొలిక్కి రాలేదు. నేను చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోయాయి. మరో ఆరుగంటల్లో అష్టబంధనం ముహూర్తం. ఋత్విక్కులు, ఎందరో పండితులు, మిరాసీదార్లు, అధ్యక్షులు, సిబ్బంది... అంతా ఆ అమూల్యక్షణాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో అష్టబంధనానికి అతి ముఖ్యమైన నవరత్నాల సెట్ లేకుండాపోతోంది. మొత్తం కార్యక్రమం అభాసుపాలయ్యే పరిస్థితి.. !!

నాలో ఆత్మావలోకనం మొదలైంది - ఎందుకిలా జరిగింది? నేనేం పాపం చేశానని ఇలాంటి సంకట స్థితి ఎదురయింది? ఈ లోపం ఎక్కడ జరిగింది?... నా పనిపట్ల నేను సీరియస్‌గా లేకపోవటమా! బోర్డు మీటింగ్కి వెళ్లక ముందే అధికార్లు చెప్పినా నేను పట్టించుకోకపోవడమా!.. ఆలోచించినకొద్దీ వేదన పెరుగుతోంది తప్ప పరిష్కారం కనబడడంలేదు. "ఏమిటీ విచిత్రం! అపారమైన అధికారాలుండి కూడా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నేను ఈ చిన్న కార్యక్రమాన్ని సజావుగా నిర్వర్తించలేక పోతున్నానే. ఎన్నో దశాబ్దాలకొకసారి వచ్చే ఈ పవిత్రమైన ఉత్సవం అభాసుపాలు కావటానికి కారకుణ్ణవుతున్నానే" అన్న ఆందోళన నన్ను వెంటాడేస్తోంది.

అప్పటికే విడివిడిగానయినా నవరత్నాలు సేకరించాలని అర్చకులు, మిరాసీదార్లు ఇతరత్రా చేసిన ప్రయత్నాలు సయితం విఫలమయ్యాయి. "ఇంక ఈ రాత్రికి నవరత్నాలు దొరకనట్లే. తెల్లవారుఝామున 5 గంటలలోపు నవరత్నాలు సేకరించడం అసాధ్యం" - అని వాళ్లు తేల్చిపారేశారు. అర్ధరాత్రయింది. స్వామి వారి ఏకాంతసేవ కూడా పూర్తయింది. నిస్పృహ, నైరాశ్యం నన్ను చుట్టుముట్టాయి. నా దీనావస్థ చూసిన అర్చకులు నా దగ్గరకువచ్చి, "ఫరవాలేదులెండి, ఏదో రకంగా సర్దుకుపోదాం. మీరు ఆందోళన చెందకండి" అని ఓదార్పు మాటలు పలికారు.

చేసేదేమిలేక నేను, నాభార్య గెస్ట్‌హవుస్‌కి తిరిగి వచ్చేశాం. నా పొరబాటుకి క్షమించవలసిందిగా దేవుణ్ణి ప్రార్థించటం మినహా నేను చేయగలిగింది లేదు. అలానే స్వామి వారిని ప్రార్థించాను. నా పొరబాటుకి లెంపలు వేసుకున్నాను. "ఇంక మిగతా కార్యక్రమం ఎలా జరుగుతుందో ఏమో, అంతా నీదే భారం స్వామి" అనుకుంటూ, ఆవేదన, ఆందోళన నిండిన హృదయంతో గెస్టవుల్లోకి అడుగుపెట్టాను.

ఆ అర్ధరాత్రి వేళ అక్కడ నాకోసం నడివయస్సు దంపతులు ఎదురుచూస్తున్నారు. వాళ్లు నన్ను కలుసుకోవాలని వచ్చారనీ, చాలా సేపట్నుంచి నిరీక్షిస్తున్నారని సిబ్బంది చెప్పారు. అయినా ఆ టైమ్‌లో వాళ్లని పలకరించే మూడ్ లేదు. " ఈ గందరగోళ పరిస్థితిలో వీళ్లెవరు ఇక్కడికి వచ్చారు" అని విసుక్కున్నాను. అయినా చాలాసేపట్నుంచి నిరీక్షిస్తున్నారని విన్నాక, సరేనని పలకరించాను. ఆయన పేరు సుబ్బారావు. మద్రాసులో ఫిల్మ్ డిస్ట్రిబ్యూటరుట. అప్పటికి నాలుగున్నర గంటల నుంచి నిరీక్షిస్తున్నారట. నేను చాలా అసహనంగా వున్నాను. "అంత అర్జంటేమిటండి, ఇలా అర్ధరాత్రివేళ వచ్చారు? రేపు ఆఫీసులో కలుసుకోవచ్చు గదా" అన్నాను. కాని వాళ్లు నా అసహనాన్ని, నా మూడ్‌ని పట్టించుకునే స్థితిలో లేరు. సుబ్బారావు, ఆయన భార్య వాళ్లు వచ్చిన పని ఏమిటో వివరించడం ప్రారంభించారు.

... మీరు ఆలయంలో మూలవిరాటికి అష్టబంధనం చేయిస్తున్నారని పత్రికలలో చదివాం. శ్రీవారి విగ్రహం అష్టబంధనంకోసం ముందుగా నవరత్నాలు వుపయోగిస్తారట గదా! అందుకోసం నవరత్నాలు బహూకరించాలని కోరుకున్నాం. ఆ రకంగా మేం స్వయంగా మద్రాసు మార్కెట్లో గాలించి రకానికొకటి చొప్పున చాలా ఖరీదు చేసే తొమ్మిది రత్నాలను ప్రత్యేకంగా ఎంపిక చేసి కొన్నాం. వీటిని ఇలా బంగారు ప్లేట్ మీద అతికింపజేసాం. మీరు ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా, మా సెంటిమెంట్స్‌ని అర్థంచేసుకుని, వీటిని అష్టబంధనంలో వినియోగించాలి.... దయచేసి మమ్మల్ని నిరాశ పరచకండి...."ఇలా ప్రాధేయపడుతూ వాళ్లు చెప్పుకుపోతున్నారు.

అంతే!... ఎక్కడో అగాథంలోకి త్రోసివేయబడినట్లున్న నా మనస్సుకి ఒక్కసారి రెక్కలొచ్చినట్లనిపించింది. అర్ధరాత్రిలో సూర్యోదయం అయిందా - అన్నంత గగుర్పాటు కలిగింది. నా చెవుల్ని, కళ్లని నమ్మలేనంత ఉద్వేగం, సంభ్రమాశ్చర్యాల మధ్య నాలో అణువణువూ ఆనందంతో పులకించిపోయింది. నా కళ్లలోంచి ఆనంద బాష్పాలు...!

దంపతుల రూపంలో వచ్చిన 'చేయూత'తో గండం గట్టెక్కింది. మర్నాడు ప్రభాత సేవ సమయానికల్లా శ్రీవారి విగ్రహానికి అష్టబంధనం, ఆ తరువాత ప్రాణశక్తి పునరావాహన..... అన్నీ అనుకున్న ప్రకారం నిర్విఘ్నంగా జరిగిపోయాయి.

ఏమిటీలీల?

★★★

# మధూ పెళ్ళి ఎవరు జరిపించారు?

పెళ్లి కొడుకు నరేంద్రని నేను మొట్టమొదటిసారిగా 1990 ఆగష్టు లో పెళ్లిపీటల మీదనేచూశాను!

అదే విచిత్రం! పెళ్లి సంబంధం పెద్దలు కుదిర్చిందే. సాంప్రదాయబద్ధంగా పెళ్లిచూపులు, జాతకాలు, వగైరా ప్రక్రియల తరువాత జరిగిందే. అయినా అతన్ని నేను పెళ్లిపీటల మీదే చూడాల్సివచ్చింది.

అమెరికాలో అసోసియేట్ ప్రొఫెసర్ (ఫైనాన్స్ మేనేజిమెంట్) గా పనిచేస్తున్న నరేంద్రకి ఎట్టి పరిస్థితుల్లోనూ డాక్టర్నిగానీ, ఇంజనీర్నిగానీ చేసుకోవటం ససేమిరా ఇష్టంలేదు. అమ్మాయి పోస్టుగ్రాడ్యుయేషన్ చదివుంటే చాలనీ, సంసారపక్షంగా ఇంటిపట్టున వుండే అమ్మాయి కావాలనీ కోరుకున్నాడు. కానీ, అతను చేసుకొన్నది ఒక డాక్టర్ని!

దీనికితోడైన మరో విచిత్రం - మాధవిగానీ, ఆమె తల్లిదండ్రులుగానీ మరో రెండు మూడు సంవత్సరాలదాకా - అంటే మాధవి మెడిసిన్ చదువు పూర్తయ్యేదాకా - పెళ్లిగురించి ఆలోచించకూడదనుకున్నారు. ఒకవేళ ఎప్పుడన్నా అలాంటి ఆలోచనలు వచ్చినా, వరుడు ఇండియాలో డాక్టర్ అయ్యుండాలి తప్ప పొరబాటున కూడా ప్రవాస భారతీయుడు కాకూడదనుకునేవాళ్లు. కాని, మాధవి తన మెడిసిన్ పూర్తి కాకుండానే, వృత్తిరీత్యా డాక్టరా కాని, ఓ ప్రవాస భారతీయుడ్ని (నరేంద్రని) పెళ్లిచేసుకోవాల్సివచ్చింది!

మాధవి మా అమ్మాయి... !

★★★

నేను విశాఖపట్నం పోర్టుట్రస్టు ఛైర్మన్ గా పనిచేస్తున్నకాలంలో - 1990లో - ఒక రోజు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ శ్రీ అప్పారావు నా దగ్గరకు వచ్చారు. అప్పటికే అనేకసార్లు ఐఓసి టెర్మినల్ ఏర్పాటు వగైరా అంశాలమీద ఆయన కలవటం, మాట్లాడటం జరిగింది. కాని ఆరోజు ఆయన వచ్చిన పని వేరు.

"మీ అమ్మాయికి మీరు పెళ్లిచేయాలనుకుంటున్నట్లయితే ఓ మంచి సంబంధం వుంది సర్" అంటూ శ్రీ అప్పారావు మొదలు పెట్టారు. నేను నవ్వేశాను.

"మా అమ్మాయి కేమిటి? ఇప్పుడు పెళ్లేమిటి అప్పారావుగారూ! అమ్మాయి మద్రాసులో మెడిసిన్ చదవడం మొదలు పెట్టి రెండేళ్లు కాలేదు. మెడిసిన్, హవుస్ సర్జన్ షిప్ పూర్తయ్యేవరకూ పెళ్లి చేసే ఆలోచనే మాకు లేదు.... వదిలేయండి. ఇంకేంటి విశేషాలు?" అంటూ నా ధోరణిలో తేల్చేశాను.

అప్పారావుగారు పెద్దగా వత్తిడి చేయలేదు. కాని చెప్పదల్చుకున్నది మాత్రం చెప్పకుండా వదల్లేదు.

"మా ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ వెంకోబారావుగారు మద్రాసునుంచి టెలిఫోన్ చేశారు. వాళ్లదికూడా చాలా సాంప్రదాయికమైన మధ్య కుటుంబం. ఆయన మేనల్లుడు ఫైనాన్స్‌లో పిహెచ్. డి చేసి, అమెరికాలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారుట. వాళ్లకి 'ఎవరో' మీ కుటుంబం గురించి చెప్పారట. ఒకవేళ మీకేమైనా మీ అమ్మాయికి పెళ్లిచేసే ఆలోచన వున్నట్లయితే, ఆ మేనల్లుడికి మాట్లాడదామని వెంకోబారావుగారి వుద్దేశ్యం...."

"అబ్బెబ్బె... మాకిప్పుడు అలాంటి ఆలోచనే లేదు. ఈ విషయం మీరా అబ్బాయి తండ్రికి చెప్పేయండి..." అంటూ నేను ఆయన మాటలు త్రుంచేశాను. జరగని విషయం గురించి చర్చించడం నాకిష్టంలేదు.

"నాతో మాట్లాడింది అబ్బాయి మేనమామండి. అబ్బాయి తండ్రి ఛార్టర్డ్ అక్కవుంటెంట్ . ఎన్నూర్ ఫౌండ్రీస్‌కి మేనేజింగ్ డైరక్టర్‌గా పనిచేస్తున్నారట. ఆ కుర్రాడు అమెరికా నుంచి వచ్చాడు. 20 రోజులు ఇండియాలో వుంటాడు. ఈలోగా మంచి పెళ్లి సంబంధం ఖాయం చేయాలన్నది వాళ్ల తాపత్రయం.. సరే, మీరు చెప్పిందే నేను వెంకోబారావుగారికి చెబుతాను..."అంటూ శ్రీ అప్పారావు ముగించారు. మరోసారి వెంకోబారావుగారి గురించీ, వాళ్ల ఆచారవ్యవహారాలగురించి అప్పారావు వివరించి లేచారు. వెళ్లిపోతూ, వెళ్లిపోతూ కూడా శ్రీ అప్పారావు, "మీరు ఒకవేళ అమ్మాయి పెళ్లి గురించి ఆలోచన చేసేట్లయితే ఇది మంచి సంబంధం సర్" అంటూ మరోమాట వేసి మరీ వెళ్లారు. "సరే" అంటూనే నేను మళ్లీ నవ్వేశాను. ఎందుకంటే, నాకు తెలుసు - ఇది జరిగే అవకాశమే లేదు.

మా అమ్మాయి మాధవికి అప్పటికి 19 ఏళ్లు. ఎమ్. బి. బి. ఎస్ పూర్తయి, హవుస్ సర్జన్ షిప్ పూర్తయ్యేసరికి మరో మూడు - నాలుగేళ్లుపడుతుంది. అప్పుడైనా, ఇండియాలో వుండే మరో డాక్టర్ వరుడ్నే చూసి చెయ్యాలని నేనూ, నా భార్య గోపిక దృఢంగా అనుకున్నాం. భార్య, భర్తలిద్దరూ ఒకే వృత్తిలో వుండేవాళ్లయితేనే, వాళ్లిద్దరి మధ్య పొంతన బాగా వుంటుందని మేం అనుకొంటూ వచ్చాం. అలాంటి నేపథ్యంలో ఇప్పుడు వచ్చింది అమెరికా సంబంధం. పైగా అమ్మాయి వృత్తికి సంబంధంలేని ఉద్యోగంలో అబ్బాయి.. అసలు ఇది జరిగే ప్రశ్నేలేదు!

ఆ రాత్రి ఇంటికి వెళ్లగానే నేను నా భార్య గోపికతో ఈ విషయం చెప్పాను. "సంబంధం మంచిదేనేమోకానీ మనం ఇప్పుడు చేద్దాం అనుకోవటం లేదు గదా! పైగా, మనం ఎలాంటి వరుడు కావాలనుకున్నాం? మీరెలాంటి వివరాలు చెబుతున్నారు?" నా భార్య విస్మయంతో ప్రశ్నించింది.

"నేనూ అదే చెప్పాను. ఇది జరిగేది కాదని" - అన్నాను. ఇద్దరం నవ్వుకున్నాం. ఎందుకైనా మంచిదని, ఆ రోజే మద్రాసు నుంచి - రెండు రోజులు వుండి వెళదామని - వచ్చిన మా అమ్మాయి మాధవి దగ్గర కూడా ఈ సంబంధం గురించి ప్రస్తావించాం. మాధవి అసలేమాత్రం ఆసక్తి చూపించలేదు. "ఇప్పుడే పెళ్లేంటి డాడీ?" అంటూ ఆ సంభాషణ త్రుంచేసింది.

ఆ రాత్రే మద్రాసు నుంచి గోపిక అంకుల్ టెలిఫోన్ చేశారు. మాటల్లో - గోపిక ఈ సంబంధం. ప్రస్తావన ఎత్తింది. వెంకోబారావుగారి మేనల్లుడు అనగానే, ఆయన "ఇది చాలా మంచి సంబంధం" అంటూ ఓ సర్టిఫికెట్ ఇచ్చేశారు.

"మనం కావాలనుకున్న వరుడి లక్షణాలు, చేద్దామనుకున్న టైమూ కుదరకపోతే వదిలేద్దాం. ఒకవేళ చేయాలనుకుంటే మాత్రం, ఇది మంచి సాంప్రదాయంగల కుటుంబం అమ్మా" అంటూ ఆయన తన అభిప్రాయం క్లుప్తంగా చెప్పారు.

"ఇక ఈ విషయం ఇక్కడితో వదిలేద్దాం. అమ్మాయి చదువయ్యాక ఆలోచిద్దాం.." అని మేం ఇద్దరం ఒక నిర్ణయానికొచ్చేశాం.

ఆ మర్నాడు ఆదివారం - ఏకాదశి. అప్పటికి కొన్నేళ్లుగా నేనూ, గోపికా ప్రతి ఏకాదశినాడు నిర్జల ఉపవాసంతో గడపటానికి అలవాటుపడున్నాం. ఆ ఉదయం నేను పూజలో వుండగా మద్రాసునుంచి నాకో టెలిఫోన్ కాల్ వచ్చింది.

అంత ప్రొద్దుటే నన్ను డిస్టర్బ్ చేసినందుకు నొచ్చుకుంటూనే ఫోన్లో ఆయన చెప్పిన విషయం

ఏమిటంటే-

ఆయన పేరు వాసుదేవరావు. ఎన్నూరు ఫౌండ్రీస్‌కి మేనేజింగ్ డైరక్టర్. ఇప్పుడు పెళ్లి సంబంధాలు వెతుకుతున్నది ఆయన కొడుక్కే. నిన్న అప్పారావుగారు చెప్పిందంతా ఈ అబ్బాయి గురించే.

"... చిన్న కమ్యూనికేషన్ గ్యాప్ వచ్చిందండీ. నిన్న మీకు అప్పారావు గారు చెప్పినప్పుడు, మా అబ్బాయి నరేంద్ర ఇండియాలో ఇరవై రోజులు వుంటాడని చెప్పారట. కాని అది కరెక్ట్ కాదు. 20 రోజులయిపోయింది. అబ్బాయి రేపే అమెరికాకి తిరిగి వెళ్లిపోవాలి. మీ అమ్మాయి ఎలాగూ మద్రాసులోనే చదువుతోంది కాబట్టి, మీకు అభ్యంతరం లేకపోతే, ఒకసారి మేం మీ అమ్మాయిని ఇవ్వాళ ఇక్కడే చూద్దామనుకుంటున్నాం... ఆహా, మీకు ఆసక్తి వుంటేనే సుమా..." అంటూ వాసుదేవరావుగారు తమ ఆసక్తి బయటపెట్టారు.

నేను ఎలాంటి సంకోచం లేకుండా ఆ ముందు రోజు రాత్రి నేనూ, గోపిక ఏం నిర్ధారించుకున్నామో అదే స్పష్టంగా చెప్పాను. మా నిర్ణయం చెబుతూనే, దానితో పాటు,

"మా అమ్మాయికి ఎప్పటికైనా మరో డాక్టర్ వరుడ్నే చూడాలనుకుంటున్నాం. మీరేమో మీ ఫైనాన్స్ మేనేజిమెంట్ చేశాడంటున్నారు.." అంటూ మరో రెండు మాటలు ఎక్కువ చెప్పేశాను. ఇక్కడితో ఆయన ఈ ఫైలు మూసేస్తాడని నా నమ్మకం.

"సరే మీ ఇష్టం" అంటూనే వాసుదేవరావుగారు కూడా మరో రెండు వాక్యాలు పొడిగించారు. "మా అబ్బాయిక్కూడా డాక్టర్ నీ, ఇంజనీర్ని చేసుకోవటం సుతరామూ ఇష్టం లేదు. మొన్న తిరుపతి, వెళ్లొచ్చాక, మీ సంబంధం విషయంలో మాత్రం తన నిర్ణయం మార్చుకోటానికి మావాడు ఒప్పుకున్నాడు. అదికూడా - మిగతా విషయాలన్నీ కుదిరితేనే"! అంటూ వాసుదేవరావుగారు ముగించారు. వాళ్లు తిరుపతి వెళ్లిరావటానికీ, వాళ్లబ్బాయి మా అమ్మాయి వృత్తి విషయంలో రాజీపడటానికి సంబంధం ఏమిటో నాకర్థంకాలేదు.

ఏమైనా, వాసుదేవరావుగారు అడిగింది సాధ్యపడే విషయం కాదని మరోసారి తేలిపోయింది. ఎందుకంటే - మాధవి ఆ సమయంలో మాతో వుంది కానీ మద్రాసులో కాదు. నిర్ణీత కార్యక్రమం ప్రకారం, ఆ మధ్యాహ్నం మాధవి ట్రైయిన్లో బయల్దేరితే, మర్నాడు ఉదయం ఆరుగంటలకి మద్రాసు చేరుతుంది. ఆ సమయానికి వాసుదేవరావుగారబ్బాయి మద్రాసులో ఢిల్లీ విమానం ఎక్కాలి - అమెరికా వెళ్లటానికి. ఒకవేళ వైజాగ్ నుంచి మద్రాసుకి విమానంలో వెళ్లాలనుకున్నా, కలకత్తా - మద్రాసు ఫ్లయిట్ రోజూ ఉదయం ఎనిమిదింటికి మాత్రమే వుంది. అంటే, నేను ఈ ఫోన్కాల్ మాట్లాడే సమయానికి ఆరోజు ఫ్లయిట్ వైజాగ్ ఎయిర్ పోర్టులో బయల్దేరిపోయివుండాలి. లేదా మరో 15-20 నిమిషాల్లో బయల్దేరాలి.

ఇదంతా వాసుదేవరావుగారికి క్లుప్తంగా చెప్పి, మరో మాట మరింత నొక్కి చెప్పాను. "ఏమైనా వాసుదేవరావుగారూ, మేం మరో మూడేళ్లదాకా మా అమ్మాయికి పెళ్లిచేయాలనుకోవటం లేదు. ఒకవేళ చేసినా, డాక్టర్ వరుడే కావాలి. అంచేత మనం ఈ విషయం ఇక్కడితో వదిలేద్దాం... ఈ సంబంధం విషయం ఎలా వున్నా మీతో పరిచయం అయినందుకు చాలా సంతోషంగా వుంది. నేను ఎప్పుడన్నా మద్రాసు వచ్చినప్పుడు కలుద్దాం. మీ ఫోన్ నంబరివ్వండి... బై బై."

ఆయన చాలా నిరాశపడ్డారని ఆయన మాటల్లో నాకర్థమైంది. ఏమైనా ఎవరు చేయగలిగిందీ ఏమీ లేదు. "సరే మీ ఇష్టం" అంటూ ఆయన కూడా ఫోన్ నెంబరిచ్చేసి ఫోన్ పెట్టేశారు.

నా సంభాషణ అంతా గమనిస్తున్న గోపిక, మాధవి, మా అబ్బాయి సంజీవ్ (15) ఈ ఫోన్కాల్ పూర్తికాగానే - నాతో చర్చకు దిగారు. నేను సరిగ్గా చెప్పానా లేదా, లేక ఇంకా ఎలా చెప్పివుంటే బాగుండేది - ఇలా తర్కించుకుంటున్నాం. టైం ఎనిమిదయింది. "మీకంటే ఏకాదశి. అలాగని మా బ్రేక్ ఫాస్ట్ కూడా బంద్ చేసేశావా"

అంటూ సంజీవ్ వాళ్లమ్మని లేపటంతో ఆ చర్చకి తెర పడింది. "ఇది జరిగేది కాదు కాబట్టే, ఆయన ఫోన్‌కాల్ కూడా మనం మద్రాసు వెళ్లటానికి అవకాశం లేని విధంగా వచ్చింది." అంటూ నేనూ లేచాను. నా పూజ మధ్యలో బ్రేక్ పడిందని అనుకుంటూ ఆదుర్దాగా వెళ్లబోతుండగా, మళ్లీ ఫోన్ మ్రోగింది.

★★★

"సర్, నేను ఫలానా కంపెనీ పనిమీద మద్రాసు నుంచి వచ్చాను. మీతో మాట్లాడదామని మొన్న నిన్న ట్రై చేశాను. మీరు బిజీగా వున్నారు. నేనిప్పుడు మద్రాసు ఫ్లయిట్ లో తిరిగి వెళ్లిపోవటానికి ఎయిర్ పోర్టుకి వచ్చాను. కానీ నా ఫ్లయిట్ మూడు గంటలు లేటుందిట. మీరు అనుమతిస్తే, నేను మీ ఇంటికి వచ్చి ఒక్క అయిదు నిమిషాలు మీతో మాట్లాడి వెళ్లిపోతాను. విల్ యు ప్లీజ్ పర్మిట్ మి?" - ఇదీ అతని ఫోన్‌కాల్. అతను వైజాగ్ ఎయిర్పోర్టు నుంచి మాట్లాడుతున్నాడు. అక్కడ్నుంచి హార్బరు పార్కులో మా బంగళాకి రావటానికి ఓ అరగంట పడుతుంది. ఈ లోపల నా పూజ ముగించుకోవచ్చు. "సరే రండి" అని అయిష్టంగానే అంటూ పెట్టేశాను.

ఇలా ఫోన్ పెట్టానో లేదో మా అందరిలో ఒక్కసారిగా ఆలోచనలు సుళ్లు తిరిగాయి. ఈ వ్యక్తి ఎవరో నాకు అంతకుముందు తెలీదు. సాధారణంగా వైజాగ్ పోర్టు చైర్మన్ పనివున్నవారెవరయినా, నా సంగతి తెలిసున్న వాళ్లయినా - నన్ను బంగళాలో కలవటానికి ప్రయత్నించరు. దానిక్కారణం - 1987 నవంబర్లో నాకెదురైన ఓ చేదు అనుభవం.

నేను ఎక్సైజు కమీషనరుగా వున్న రోజుల్లో - ఒక సాయంత్రం ప్రముఖ లిక్కర్ వ్యాపారవేత్త మాగుంట సుబ్బరామిరెడ్డి మా ఇంటికి వచ్చారు.

సుబ్బరామిరెడ్డి అంతకు ముందు కూడా రెండు మూడుసార్లు నన్ను ఆఫీసులో కలిశారు. అయితే ఆయనక్కావలసిన పనులేవీ నా స్థాయిలో జరగాల్సినవి లేవు. చాలా వరకు క్రింది స్థాయి అధికారులే చూస్తారు.

అలాంటి సుబ్బరామిరెడ్డి ఓ సాయంత్రం బంజారాహిల్స్లోని మా ఇంటికి వచ్చి, మర్యాద పూర్వకంగా కలవటానికి మాత్రమే వచ్చానని చెబుతూ, నాకు పుల్లారెడ్డి స్వీట్స్ ప్యాకెట్ బహూకరించారు. కొన్ని నిమిషాలు ఏవో పిచ్చాపాటీ మాట్లాడి, ఫ్లయిట్ కి టైమైందంటూ వెళ్లిపోయారు.

ఆయన వెళ్లిపోయిన సుమారు ఓ 20-30 నిమిషాల తరువాత మా అబ్బాయి సంజీవ్ స్కూలు నుంచి వచ్చి, ఆకలిగావుందంటూ ఎదురుగావున్న స్వీట్ ప్యాకెట్ తెరవటంతో నేను షాక్ తిన్నాను. 3 ప్యాకెట్లో వున్నవి స్వీట్లు కావు - నోట్లు.

నా తత్త్వం తెలిసున్న మా నాన్నగారు, నా భార్య గోపిక, పిల్లలు మాధవి, సంజీవ్ కూడా ప్రమాన్పడిపోయారు ఆ కరెన్సీ ప్యాకెట్ చూస్తూ. కొన్ని నిమిషాలపాటు, మా అందరికీ మెదడు మొద్దు బారిపోయినట్లయింది.

నా సంగతి ఎరిగున్న వాళ్లెవరూ ఇలాంటి ప్రయోగం నామీద చేయరు. కాని ఇప్పుడు సుబ్బరామిరెడ్డి ఇలా ఎందుకు చేశాడు? నాతో “స్వీట్స్” అని చెప్పి వుండకపోతే, నేను తీసుకోనని తెలుసుకనుక అబద్దం చెప్పాడు? ఇది అతనికే పుట్టిన సొంత ఆలోచనా? ఇంకెవడన్నా చేయించాడా?....

“ఇంకా మీనమేషాలు లెఖ్ఖ పెడుతున్నారా? ముందు వాటి సంగతి తేల్చండి” అంటూ నా భార్య హెచ్చరించటంతో స్పృహలోకి వచ్చాను... క్షణాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారికి ఫోన్ చేశాను. ఆఘమేఘాల మీద ఒక బృందం వచ్చి కరెన్సీ లెఖ్ఖ పెట్టి (ఒక లక్ష) స్వాధీనం చేసుకుంది. అదే సమయంలో మరో బృందం ఎయిర్పోర్టుకి పరుగెత్తి, విమానం ఎక్కబోతున్న సుబ్బరామిరెడ్డిని అరెస్టుచేసింది. (తరువాతెప్పుడో తెలిసింది - క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడటం వల్ల నాచేత సస్పెండు చేయబడిన ఓ ఎక్సైజు అధికారి, సుబ్బరామిరెడ్డిని పురిగొల్పి, నామీద ఈ ప్రయోగం చేయించాడు.)

అప్పట్నుంచీ ప్రైవేటు పార్టీల్ని బంగళాకి రానివ్వటం మానేశాను.

★★★

ఇప్పుడీ ఆదివారం నాడు ఇతనెందుకు అర్జంటుగా ఫోన్‌చేసి ఎయిర్ పోర్టు నుంచి వచ్చి వెళ్తానంటున్నాడు? ముందు కొంచెం అనుమానించాను. కానీ, అతను నాతో మాట్లాడాలనుకున్న విషయం చాలా సాధారణమైన పోర్టు వ్యాపార విషయం. పైగా అతను చాలా దూరాన్నుంచి వచ్చాడు. కాబట్టి అభ్యంతర పెట్టక్కర్లేదు. అయితే అంత చిన్న పనికి అతను ఎయిర్పోర్టు నుంచి 20 కిలోమీటర్లు వచ్చి వెళ్లటం శుద్ధదండగ. అయినా ఫోన్ చేసి, “మద్రాసు ఫ్లయిట్ మూడు గంటలు లేటుం”దంటూ మొదలు పెట్టాడు. మరిందాక వాసుదేవరావుగారితో మాట్లాడినప్పుడు ఫ్లయిట్ వెళ్లిపోయిందనుకున్నామే. ఇంతలోనే ఈ సమాచారం ఏమిటి? యాదృచ్ఛికమా? దైవేచ్ఛా?

“బహుశా ఇది కూడా గాడ్స్ విష్ అయివుంటుందేమో డాడీ” అంటూ సంజీవ్ జోక్ చేశాడు. అందరం అక్కడేవున్న - తిరుపతిలో మాకు మిత్రులు బహూకరించిన - శ్రీనివాసుడి విగ్రహం వైపు చూశాం. నేను గోపిక వంక, మాధవి వంక, వాళ్లు నావంక, అందరం మళ్లీ శ్రీనివాసుడి వంక .... కొన్ని సెకన్లపాటు అందరం అలా మార్చి మార్చి చూశాం - చూసుకున్నాం!!

“ఏమ్మా మధూ, ఏం చేద్దాం? ఫ్లయిట్‌కి టైముంది. వాళ్లు నిన్ను చూడాలనుకుంటున్నారు. ఏం చేద్దాం చెప్పు?” నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ నేను చివరిసారిగా

అడిగాను. మాధవి కొంచెం తటపటాయిస్తూ, “చూడటం వరకు నాకభ్యంతరంలేదు. కానీ నా చదువుకి ఇబ్బంది లేకుండా. వుంటే..” మధూ వాక్యం పూర్తిచేయలేకపోయినా, తన మనసులో భావం నాకర్థమైంది. “పోనీలెండి, అబ్బాయి తరుపువాళ్లు వాళ్లంతట వాళ్లే అంతగా అడుగుతుంటే, వెళ్లి చూసొస్తే ఏమయింది? చూసినంత మాత్రాన సెటిల్ అయిపోవాలని లేదు గదా”- ఇది గోపిక సలహా... విచిత్రంగా క్షణాల్లో మా అందరి మూడ్స్ మారిపోయాయి!!!

ఇంక నేను తాత్సారం చేయలేదు. వెంటనే ఎయిర్లైన్స్కి ఫోన్ చేసి, కలకత్తా-మద్రాసు ఫ్లయిట్ సంగతి, మద్రాసుకి టిక్కెట్స్ సంగతి వాకబు చేశాను. ఫ్లయిట్ మూడుగంటలు లేటున్న విషయం వాళ్ళు నిర్ధారించారు. కాని టిక్కెట్లు ఖాళీ లేవనేశారు. ఎగిరిన ఉత్సాహపు కెరటం విరిగి క్రింద పడినట్లయింది.

“ఏరా సంజీవ్! ఇందాక గాడ్స్ విష్ అన్నావ్. ఇప్పుడు టిక్కెట్లేవీ?” అంటూ మా వాడికి చిన్న జెలక్ ఇచ్చాను. వాడు బుంగమూతి పెట్టేసి, “మీరే అంటారు గదా, జరిగేలా వుంటే, అన్నీ ఆయనే (శ్రీనివాసుడే) చూసుకుంటాడనీ. టిక్కెట్లు నన్నడుగుతారేంటీ!” అంటూ జారిపోయాడు.

సరిగ్గా అప్పుడే తిరుపతిరాజు వచ్చాడు. ఆయన మా పోర్టులో మేనేజర్ (ఆపరేషన్స్). విశాఖపట్నంలో పోర్టు తిరుపతిరాజు అంటే తెలియని పెద్దమనిషి వుండడు. అతని పబ్లిక్ రిలేషన్స్ అసాధారణమైనవి... అతను ఈ విషయం వింటూనే, “సర్, నన్నొక్కసారి ట్రై చేయనివ్వండి” అంటూ ఫోన్ల మీద ఫోన్లు చేసేశాడు. పది నిమిషాల తర్వాత ఒక టికెట్టు ఖాయం చేశాడు. కాని మాధవి ఒక్కత్తే ఎలా వెళ్తుంది? నేనూ గోపిక కూడా వెళ్లాలి కదా!”

తిరుపతిరాజు మళ్లీ ఎయిర్ లైన్స్ వాళ్లతో మాట్లాడాడు. వాళ్లతో కలకత్తాకి మాట్లాడించాడు అక్కడ్నుంచేమైనా దొరుకుతాయేమోనని. ఫలించలేదు. “సర్, నేను ఎయిర్పోర్టుకెళ్లి ట్రై చేస్తాను. ఈ లోపల మీరు రెడీ అయిపోండి” అంటూ తిరుపతి రాజు ఒక్క వూపులో ఎయిర్ పోర్టుకి పరుగు తీశాడు.

నిజానికి ఆరోజు మద్రాసుకి ముగ్గురం విమానంలో వెళ్లటానికి టిక్కెట్లు కొనేంత క్యాష్ నాదగ్గర లేదు. ఆదివారం కాబట్టి బ్యాంకు లేదు. వున్నా 10 గంటల దాకా బ్యాంకులు తెరవరు. ఇవన్నీ ముందే చెప్పేశాను తిరుపతిరాజుకి. అతను కూడా బయల్దేరే ముందే ఎవరో ట్రావెల్ ఏజంటికి ఫోన్చేసి, టిక్కెట్లు దొరికే పక్షంలో, అతని ఎక్కవుంట్లో మాకు క్రెడిట్ ఇచ్చే ఏర్పాటు చేసి, వెళ్లి పోయాడు... మరో గంటకి ఎయిర్పోర్టునుంచి తిరుపతిరాజు ఫోన్ చేశాడు. “సర్, అతికష్టం మీద మరొక్క టిక్కెట్ దొరికింది.” - అంటే ఎవరో ఇద్దరమే మద్రాసు వెళ్లగలం. గోపిక నన్ను వెళ్లమంది

మాధవితో. నేను బాగా ఆలోచించి, "పిల్లతో తల్లివుండటం అన్ని విధాలా మంచిది. నువ్వే వెళ్లు" అన్నాను. ఆమె అయిష్టంగానే అంగీకరించింది...

వెంటనే నేను మద్రాసు పోర్టు చైర్మన్ శ్రీబాలరాజ్ (నాకు ఐఏఎస్ బ్యాచ్మేట్) కి ఫోన్ చేయటం, గోపిక, మాధవిల ట్రాన్స్పోర్టు, పోర్టు గెస్ట్‌హవుస్ లో బస వగైరా ఏర్పాటు చేయటం చకచకా జరిగిపోయాయి. ఇవన్నీ అయ్యాక, మద్రాసులో వాసుదేవరావుగారికి ఫోన్ చేసి, ఈ పరిణామాలు చెప్పేసరికి, ఆయన ఆనందాశ్చర్యాలలో మునిగిపోయారు. "ఇదేదో దైవఘటనలా వుంది ప్రసాద్ గారూ, గాడ్ ఈజ్ గ్రేట్" అంటూ ఉత్సాహపడిపోయారు.. మరో గంటకి గోపిక, మాధవి మద్రాసు ఫ్లయిట్ ఎక్కేశారు.

"ఏమండీ, అమ్మాయి - అబ్బాయి ఒకర్నొకరు ఇష్టపడుతున్నారు. ఇప్పుడేం చేద్దాం?" - ఇదీ ఆ సాయంత్రం ఏడుగంటలకి నాకు గోపిక ఆదుర్దాగా చేసిన ఫోన్‌కాల్.

నాకు నమ్మశక్యంకాలేదు. పన్నెండు గంటలక్రితం అసలు మొదలేలేదు. ఇంతలో ఇంత మార్పా?

గోపిక ఇంకా చెప్పింది - వాళ్లిద్దరూ ఓ గంట మాట్లాడుకున్నాక, ఇద్దరికీ ఇష్టమే అంటున్నారు. ఐతే, గోపిక, మాధవి ఒకసారి అబ్బాయి తాతగారి దగ్గరకెళ్లి కనబడిరావాలని వాసుదేవరావుగారి కోరికట. అదొక్కటీ అయిపోతే, ఈ సంబంధం ఖాయమైపోయినట్లేనట. "ఏం చేయమంటారు?" గోపిక ప్రశ్న.

"పోనీ వెళ్లొచ్చేయండి" నా జవాబు.

"అదేంటి మీరు లేకుండానా? పైగా అసలు మీరు నరేంద్రని చూడనే లేదు. మీరు చూడకుండా మాట్లాడకుండా నేను 'ఎస్' అనేయటమేంటి? తండ్రిగా అది మీ బాధ్యత కాదా?..." గోపిక మాటల్లో నాకు మద్రాసులో పరిణామాల స్పీడు అర్థమైంది. కాని ఎలా? నరేంద్ర మర్నాడు పొద్దునే ఢిల్లీ మీదుగా అమెరికా ప్రయాణమవుతున్నాడు.

ఒకే ఒక మార్గం - నేను రేపటి సాయంత్రం లోపల ఢిల్లీ వెళ్లగలిగితే - నరేంద్రని కలుసుకోవచ్చు మాట్లాడవచ్చు. కాని వైజాగ్ నుండి ఢిల్లీకి రేపు సాయంత్రం లోపల చేరటం అంటే? - రైళ్లు, విమానాలు వగైరా అన్ని మార్గాలు ఓ అరగంటలో శోధించేసి తేల్చిందేమంటే - నేను నరేంద్రని కలుసుకోవటం సాధ్యపడదు. కాని, నేను అబ్బాయిని చూడకుండా, మాట్లాడకుండా, సంబంధం ఖాయమైపోవటమేంటి? - ఇది గోపిక ప్రశ్న. ఇదీ నిజమే మరి ఎలా?

అసలు ఎందుకింత మీమాంస జరుగుతోంది. అబ్బాయికి అమ్మాయి నచ్చింది. అతన్ని చేసుకోవటానికి అమ్మాయి ఇష్టపడుతోంది. వాళ్ల సాంప్రదాయం, కుటుంబం స్థాయి, స్థితిగతులు, అబ్బాయి చదువు, సంపాదనా... అన్నీ మనకు నచ్చాయి. అమ్మాయిని చూసిందగ్గర్నుంచీ వాళ్లకి మన సంబంధం పట్ల ఆసక్తి పెరిగింది.

అయినప్పుడు, నేను అబ్బాయిని చూడటం చూడకపోవటం వల్ల కొత్తగా ఒరిగేదేమిటి? పైగా గోపిక కూడా 'ఓకే' అంటోంది కదా.... చివరికి నేను నరేంద్రతో టెలిఫోన్లో మాత్రమే మాట్లాడగలిగాను.

ఆ రాత్రి 8.30 గంటల ప్రాంతంలో వాసుదేవరావుగారితో చెప్పేశాను. "మిగతా అన్ని విషయాలు అందరికీ నచ్చాయి కనుక, నేను నరేంద్రని కలుసుకోవటం కోసం మన ప్రయత్నాలు ఆపనఖ్ఖర్లేదు.... అయితే, వాసుదేవరావుగారూ! నాకు జాతకాల మీద నమ్మకం వుంది. ఒకసారి ఇద్దరి జాతకాలు చూపిస్తాను. జాతకాలు నప్పితే - ఈ పెళ్లి ఖాయం. ఏమంటారు?" వాసుదేవరావుగారు కొంచెం ఇబ్బంది పడ్డారు. ఇంతదూరం వచ్చాక జాతకాల పేరు మీద ఈ సంబంధం చేజారిపోతుందేమోనన్న అనుమానం ఆయన మాటల్లో తొంగిచూసింది. కాని-నా అనుభవం నాది.......

గుంటూరు జిల్లా సిరిపురం గ్రామంలో మా నాన్నగారు పత్రి కృష్ణారావుగారు ఒక స్కూలు టీచరు. ఆ స్కూలు హెడ్మాష్టరు శ్రీబలిజేపల్లి కామశాస్త్రిగారు. ఆ వూళ్లో ఆర్.ఎం.పి. లోకల్ ఫండ్ డాక్టరుగారు చందారం సుబ్బారావుగారు. వాళ్ళు ముగ్గురూ మంచి స్నేహితులు. కామశాస్త్రిగారి అబ్బాయి శివశంకరశాస్త్రి, సుబ్బారావుగారి అబ్బాయి మాధవరావు, నేనూ ఒకే క్లాసులో చదివేవాళ్లం. మంచి మిత్రులం. హెడ్మాష్టరు కామశాస్త్రిగారు మంచి జ్యోతిష్కులు. ఒకనాడు మానాన్నగారు యింటికి చాలా ఉత్సాహంగా, హడావుడిగా వచ్చి, నా జాతకం చూసి, నేనేమౌతానని కామశాస్త్రిగారు చెప్పారో ఆ జోస్యం అందరికీ చెప్పారు. శంకరం గురించి, మాధవ గురించి కూడా జోస్యం చెప్పారట.

కామశాస్త్రిగారి అధ్యయనం చేసి తేల్చి చెప్పిందేమిటి? శివశంకర శాస్త్రి ఐపిఎస్ చేస్తాడనీ, నేను ఐఏఎస్ లో చేరతాననీ, మాధవరావు మంచి రాయసగాడు (జర్నలిస్టు) అవుతాడనీ... మేమందరం నేను అప్పుడే ఐఎఎస్ అయినట్లే సంబరపడ్డాం. క్రమంగా మర్చిపోయాం.

నేను పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి, లా చదివి, రాయ్పూర్ యూనివర్సిటీలో లెక్చరర్ గా పనిచేస్తున్నప్పుడు మా నాన్నగారు నా చిన్నప్పటి జాతకం కథ గుర్తుచేస్తూ, నన్ను సివిల్ సర్వీసెస్కి - రాయమన్నారు. రాశాను. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్లో చేరాను.

కామశాస్త్రిగారి జోస్యం నావరకే నిజం కాలేదు. ఆయన కొడుకు శివ శంకర శాస్త్రి ఇండియన్ పోలీస్ సర్వీసెసి సెలెక్ట్ అయ్యాడు. (తరువాత కేరళలో పనిచేసి, డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రిటైరయ్యాడు). మాధవరావు చేయితిరిగిన జర్నలిస్టుగా ఇండియన్ ఎక్స్ప్రెస్, ది హిందూ పత్రికలలో చాలాకాలం విజయవాడలో పనిచేసి, ఉత్తమ

జర్నలిస్టు అవార్డు కూడా సాధించాడు. ఆ అనుభవంతో అమెరికన్ కన్సులేట్ (మద్రాసు) లో దక్షిణ భారతానికి పొలిటికల్ అఫైర్స్ పరిశీలకుడిగా కూడా పనిచేశాడు.

నా చిన్నతనం నుంచీ జరిగిన పరిణామాలన్నీ సింహావలోకనం చేసుకున్నప్పుడు, జ్యోతిశ్శాస్త్రం కూడా ఒక ఆధారపడదగిన సైన్సే అనిపించేది. అదే నమ్మకం నా మనసులో స్థిరపడిపోయింది. అనేక అనుభవాల తర్వాత నాకర్థమైందల్లా జ్యోతిష్కుడి సామర్థ్యం తక్కువైతే జోస్యం తప్పు కావచ్చేమోకాని, జ్యోతిశ్శాస్త్రం మాత్రం తప్పుకాదు...

అందుకే వాసుదేవరావుగారితో "జాతకాలు చూపిద్దాం" అని పట్టుబట్టాను. ఆయన "నో" అనలేదు.

గోపిక మద్రాసు నుంచి తిరిగి వస్తూ నరేంద్ర జాతకం తీసుకువచ్చింది. జాతకాలు చూపించాం. ఎక్స్ లెంట్! జాతకాలు కుదిరాయన్నారు. పెళ్లి ఖాయం అని తేలిపోయింది. ఠక్కున గోపికకి ఏదో గుర్తుకొచ్చింది. "ఏమండీ, మీకు జ్ఞాపకం వుందా? చాలాకాలం క్రితం మనం దైవజ్ఞశర్మగారిని హైద్రాబాద్ లో కలిసినప్పుడు, ఆయన మాధవి మెడిసిన్ చదువుతుందనీ, కాని చదువు పూర్తి కాకుండానే పెళ్లి జరుగుతుందనీ చెప్పారు.. అలాగే జరుగుతోంది కదా ఇప్పుడు?" అవును నాకు జ్ఞాపకమొచ్చింది. ఆరేళ్ల క్రితం బాసర సరస్వతీ ఉపాసకుడు శ్రీ దైవజ్ఞశర్మ మాధవిని చూస్తూనే సంఖ్యాశాస్త్రం ఆధారంగా చెప్పిన జోస్యం అది...

మరో నలభై రోజుల తరువాత - ఆగష్టు 23న వివాహం ఖాయమైంది. పెళ్లి మద్రాసులో జరగాలని వాసుదేవరావుగారి కోరిక. వైజాగ్లో చేద్దామని నా ఆలోచన. పరిస్థితులు అలా అలా తోసుకువచ్చి, చివరికి ఆ పెళ్లి తిరుపతిలో జరపాలని నిర్ణయమైంది.

అసలు సమస్య నాకు అప్పుడు ఎదురైంది. సర్కారు వారిచ్చిన అప్పుతో కట్టుకున్న (హైద్రాబాద్ ) ఓ ఇల్లు, అలాగే కొన్న కారు, నా భార్యకి మామగారిచ్చిన పొలం మినహా నా చేతిలో కూతురు పెళ్లి చేయటానికి కావలసిన డబ్బు - ఆరోజు లేదు. బ్యాంకు బ్యాలెన్స్ ఓ ఎనిమిదివేలు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ నుంచి తేగలిగింది ఓ పాతికవేలు. ఇంకా రెండు -రెండున్నర లక్షలుంటే గానీ తిరుపతిలో పెళ్లి చేయలేను... అప్పు చేయాలి? ఎక్కడ? ఎలా?

ఆరోజు ఉదయం ఇలా ఆలోచిస్తూ ఢిల్లీ వెళ్లే పనిమీద విమానంలో హైద్రాబాద్ వెళ్లాను. దారంతా ఇదే ఆలోచన. చివరికి "ఎందుకింత ఆందోళన చెందుతున్నాను. ఏ స్వామి ఇంత వరకు తీసుకువచ్చాడో - ఆ స్వామే దీనిక్కూడా పరిష్కారం చూపిస్తాడు. ఆయనకే వదిలేస్తే పోలేదా?" అనుకున్నాను. వదిలేశాను. అలా అనుకుని హైద్రాబాద్ ఎయిర్పోర్టులో దిగగానే, పోర్టు హైద్రాబాద్ మేనేజర్ సుబ్బారావు నన్ను కలిసి,

"సనతనగర్ ఇండస్ట్రియల్ కోపరేటివ్ సొసైటీలోమీ స్థలాన్ని కొంటానని గులామ్ దస్తగిరి అడుగుతున్నాడు, సర్" అని చెప్పాడు.. !

★★★

నేను ఖమ్మం కలెక్టరుగా వున్నప్పుడు పరిశ్రమలశాఖ డిప్యూటీ డైరక్టర్గా వుండే రాజారెడ్డి, నేను టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా వుండే రోజుల్లో (1980-81లో) ఇండస్ట్రియల్ కోపరేటివ్ సొసైటీ డైరక్టర్స్తో కలిసి నా దగ్గరకు వచ్చాడు. అప్పటికతను జాయింట్ డైరెక్టర్గా హైద్రాబాద్ లో చేస్తూనే, సనత్ నగర్లో ఒక పెద్ద ప్రైవేట్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ని అభివృద్ధి చేయటానికి డెప్యుటేషన్ మీద పనిచేస్తున్నాడు. ఆ సొసైటీ డైరక్టర్లు అందరూ శ్రీనివాసుడి భక్తులే. అందుకే శ్రీవేంకటేశ్వరా సొసైటీ అని పేరు పెట్టుకున్నారు. మొదటి షేర్ 100 రూపాయలు వేంకటేశ్వరుడు తీసుకోవాలన్నది వాళ్ల కోరిక. కాని ఆ పనిచేయటం సాధ్యపడదని చెప్పేసరికి, కనీసం "స్వామివారి ప్రథమ సేవకుడిగా మీరన్నా ఒక షేర్ తీసుకోండి" అంటూ అభ్యర్థించారు. "సరే" అంటూ మొదటి షేర్ కొన్నాను.

రెండేళ్ల తరువాత సొసైటీ వాళ్లు నాకు లెటర్ రాశారు - ఇండస్ట్రియల్ ఎస్టేట్ రెడీ అయిందనీ, షేర్ హోల్డర్గా నేను కూడా ఒక ప్లాటు తీసుకోవచ్చనీ, దానికి ఓ లక్షరూపాయలు కట్టాలనీ. నాకు పరిశ్రమ పెట్టే అవకాశమూలేదు, స్తోమతూ, ఆసక్తీ లేవన్నాను. మళ్లీ కొన్నాళ్లకి సొసైటీ వాళ్లు ఆ ఎస్టేట్లో మిగిలిపోయిన వంకర ప్లాట్లని లాటరీద్వారా సభ్యులకు పంచాలని నిర్ణయించారు. ఆలా ఓ 200 చదరపు గజాల పొడవాటి ముక్కని 9000 రూపాయలకి నాకు ఆఫర్ చేశారు. అది కూడా నేను మూడు వాయిదాల్లో కట్టవచ్చన్నారు. ఇంకా పైన రిజిస్ట్రేషన్కి ఓ వెయ్యిరూపాయలవుతుంది. చివరి వాయిదా మూడు వేలు కట్టడానికి నోటీసు వచ్చినప్పుడు, నేను సనత్ నగర్ వెళ్లి చూద్దునుగదా అదో విచిత్రమైన ప్లాటు.

ఒక ఇండస్ట్రియల్ ప్లాటుకి, మరో సన్నటి రోడ్డుకి మధ్య వంకర టింకరగా వున్న పొడవాటి స్థలం. ఒకే చోట దాని వెడల్పు చాలా ఎక్కువగా వుంది - అదీ తొమ్మిది అడుగులు. అనవసరంగా డబ్బులు పెట్టాననిపించింది. మొత్తం 10 వేలు వృధా అయినట్లే అనుకుని, బాధపడి, మూడో వాయిదా కట్టడం మానేశాను... కాని సొసైటీ వాళ్లు వదల్లేదు. సెక్రటరీ వచ్చి, ఆ ఒక్క వాయిదా కట్టేస్తే, రిజస్ట్రేషన్ చేసేస్తామన్నారు. "ఇప్పటిదాకా పెట్టిందే దండగనుకుంటుంటే, మళ్లీ నాలుగువేలు ఖర్చా! నాకొద్దు" అన్నాను. ఆయన వదల్లేదు. అయిష్టంగా ఆ నాలుగు వేలు కట్టేశాను. రిజిస్ట్రేషన్ అయిపోయింది. ఇది జరిగింది ఎప్పుడో 1985-86లో.

★★★

ఇప్పుడా ప్లాట్ కొనుక్కుంటానని దస్తగిరి అడుగుతున్నాడని సుబ్బారావు చెబుతున్నాడు. “ఎంతిస్తానంటున్నారు?”

“యాభైవేలు. సర్”

“నాకిప్పుడు రెండు లక్షలకు పైగా కావాలి సుబ్బారావు. నువ్వోసారి సొసైటీకి వెళ్లి రేటు ఎలావుందో కనుక్కుని చెప్పు - అప్పుడే మాట్లాడదాం”అని ఢిల్లీ వెళ్లిపోయాను.

నేను ఢిల్లీనుంచి తిరిగి వచ్చేసరికి సుబ్బారావు కీలకమైన సమాచారం పట్టుకొచ్చాడు... ఎస్టేట్ లో దస్తగిరికి రెండు ప్లాట్లున్నాయి. ఒకటి నా వంకర ప్లాట్కి ఆనుకుని వున్నది. మరొటి ప్రక్క రోడ్డుకి అవతలవైపు ఆనుకొని వున్నది. నేను నాప్లాట్ ఇచ్చేస్తే, అతను ఆ ఇంటర్నల్ రోడ్డుని (అది ఇంకెవరికీ వుపయోగపడేదికాదు) కూడా కలుపుకుంటాడు. తన రెండు ప్లాట్ లూ కలిపేసి, ఒకటే పెద్ద ప్లాట్ చేసుకుంటాడు.

నేను ఢిల్లీనుంచి వచ్చి వైజాగ్ ఫ్లయిట్ ఎక్కబోయేముందు, సుబ్బారావు నాకు ఇదంతా వివరిస్తుండగా దస్తగిరి కూడా వచ్చాడు. బేరం మొదలైంది. అప్పటికే దాని విలువ అర్థమైంది కనుక నేను మూడు లక్షలిమ్మని అడిగాను. అతను 15వేల నుంచి మొదలు పెట్టి రెండు లక్షలదాకా వచ్చాడు.

“దస్తగిరిగారూ! స్థలాల విలువ ఎంత పెరిగిందో మీకు తెలుసు. రెండు లక్షలు న్యాయం కాదు. రెండున్నర లక్షలిచ్చేయండి...” (ఏదో అతని అవసరం తెలిసిపోయింది కాబట్టి అలా అంటున్నాను గానీ, నాకుగా నేను అమ్మాల్సివస్తే, ఆ వంకరటింకర పీలిక స్థలాన్ని కొనటానికి వివేకమున్నవాడెవడూ ముందుకురాడు.)

“సర్, సర్ - నేనూ రెలిజియస్ పర్సన్నే. మీకు అన్యాయం జరిగిందన్న భావం మీకూ వుండకూడదు నాకూ వుండకూడదు. అందుకే చివరగా రెండుంపాతిక ఇస్తాను కాదనకండి. ప్లీజ్... ” అంటూ దస్తగిరి రిక్వెస్టు చేశాడు. మనసులో ఆనందపడిపోయాను. నాకు మాధవి పెళ్లి కోసం అప్పు చేయనఖ్ఖర్లేకుండా డబ్బు దొరికిపోయింది గదా! (ఎవడు దొరికేలా చేశాడు?)

అప్పటికప్పుడు ఓ యాభైవేలు అడ్వాన్సు కూడా ఇచ్చాడు. నా రిక్వెస్టు కాదనలేక, పెళ్లికి ముందే మూడు నాలుగు వాయిదాల్లో మొత్తం రెండు లక్షల పాతికవేలు దస్తగిరి ఇచ్చేశాడు. నిజానికి ఈ సొసైటీలో ప్లాట్ ఇంకొకరికి అమ్మాలన్నా, అది రిజిస్ట్రేషన్ కావాలన్నా అంత సులభం కాదు. చాలా తతంగం వుంది. అయినా దస్తగిరి రిజిస్ట్రేషన్ కోసం ఎదురు చూడకుండా నాకు డబ్బిచ్చేశాడు. రిజిస్ట్రేషన్ జరగటానికి - మాధవి పెళ్లి అయిపోయాక ఆరేళ్లు పట్టింది. దస్తగిరి చనిపోతే, ఆయన కొడుకు సామి పేరుమీద రిజిస్ట్రేషన్ జరిగింది!

★★★

1990 ఆగష్టు 23న తిరుపతిలో మాధవి పెళ్లి సాంప్రదాయబద్ధంగా జరిగింది. ఆ పెళ్లిలోనే నేను మాఅల్లుడు నరేంద్రని మొదటిసారి చూశాను.

ఇంకా విచిత్రం ఏమంటే - నేను నాకున్న డబ్బు పరిమితం కనుక పెళ్లి నిరాడంబరంగా చేయాలనుకున్నాను. కాని నేను పిలిచిన వాళ్లందరూ వచ్చారు. పిలవకపోయినా నన్ను ఎరిగినవాళ్లు చాలామంది నా మీద అభిమానంతో వచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానాల వేదపండితులు, అర్చకులు, మిరాసీదార్ల నుంచి నాదస్వర విద్వాంసులు దాకా అంతా స్వచ్ఛందంగా ఈ పెళ్లి తమ స్వంత కార్యంలాగా జరిపించారు. శుభలేఖ మీద స్వచ్ఛందంగా శ్రీనివాసకళ్యాణం డిజైన్ చేయించి తెచ్చిన డాక్టర్ భాస్కరరావు మొదలుకొని ఎంతోమంది హస్తం ఆ పెళ్లిలో వుంది.

పేష్కార్ కృష్ణస్వామి, శేషాద్రి, సంతానం, డాక్టర్ సూర్యారావు, గార్డెన్ సూపరింటెండెంట్ తమ్మన్న, ఇంజనీర్ జగ్గారావు, జనార్దననాయుడు, క్యాటరింగ్ శాస్త్రి, రాఘవన్, టిటిడి యూనియన్ లీడరు చెంగారెడ్డి, డాక్టర్ ఎ.కె.వి.ఎస్.రెడ్డి, ఎన్. థిల్లేశ్వరరావు, జి. వల్లీశ్వర్, తిరుపతిరావు, బి. రామచంద్రయ్య, డాక్టర్ సుబ్బారాయుడు, నా పాత పి.ఎలు నారాయణ, విశ్వమూర్తి, దఫేదార్ సుబ్రమణ్యం, డ్రైవర్ గోపాల్ ఎందరో టిటిడి ఎంప్లాయీస్, తదితర శ్రేయోభిలాషులు మా కుమార్తె వివాహాన్ని వాళ్ల భుజస్కంధాల మీద వేసుకుని జరిపించారు. ముఖ్యంగా అప్పటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ ఎమ్.వి.ఎస్. ప్రసాద్ అందించిన సహకారం మర్చిపోలేనిది. ఇంకా విశేషం ఏమంటే, ప్రముఖ గాయనీమణి శ్రీమతి ఎమ్. ఎస్. సుబ్బలక్ష్మి వచ్చి, మాంగల్యధారణ సమయంలో స్వచ్ఛందంగా రెండు కీర్తనలు శ్రావ్యంగా ఆలపించి, ఆ సన్నివేశానికి గొప్ప శోభ తీసుకువచ్చారు. నిజానికి, ఒక ఆడపిల్ల పెళ్లిచేసిన భారమే నాకు అనిపించలేదు.

జరిగి పోయింది. తిరుమల కొండకి నవదంపతుల్ని తీసుకువెళ్లి దర్శనం చేయించాం. అందరం కళ్యాణోత్సవంలో కూర్చున్నాం..

స్వామికి నమస్కరిస్తూ, జరిగిన శుభకార్యానికి మాటల్లో చెప్పలేనన్ని కృతజ్ఞతా భావాలు వ్యక్తం చేస్తున్నాను.

“ఒక రెండునెలలక్రితం పెళ్లి ఆలోచనేలేదు. ఇప్పుడు పెళ్లిచేసుకుని ఇక్కడకు వచ్చాం. ఏమిటీ మాయ? ఎలా జరిగిందిదంతా?”... ఒక్కసారిగా ఆ రెండుమాసాల కథ నా కళ్ల ముందు సినిమా రీలులా తిరిగిపోయింది. వుండబట్టలేక నా మనసులో భావాల్ని మా వియ్యంకుడు వాసుదేవరావుగారి ముందు అనేశాను.

“నేను చెప్పాను గదా! ఇక్కడే! మా నరేంద్రకి సంబంధాలు వెతుకుతూ కొండకొచ్చి ఇలాగే కళ్యాణోత్సవం చేయించుకున్నాం. ఇక మావాడి పెళ్లి భారం నీదే స్వామి - అనుకున్నాం. అప్పుడే ఇక్కడ పరిచయమైన అర్చకులు మీ గురించి చెప్పి,

మీకో అమ్మాయివుందని, మద్రాసులో చదువుతోందనీ, పెళ్లీడు వచ్చుంటుందనీ, ప్రయత్నించమనీ చెబితే... మా అబ్బాయి కూడా మనసు మార్చుకుని..." ఆయన చెబుతూనే వున్నారు.

అంతే! స్వామివారి కళ్యాణోత్సవం పందిట్లోనే నాకర్థమైపోయింది - మా సంబంధం గురించి వాళ్లకి 'ఎవరు' చెప్పారో, మాధవి కళ్యాణం 'ఎలా' జరిగిందో, 'ఎవరు' జరిపించారో .... ఆయనింకా వివరించాలా!

హరే శ్రీనివాస!

★★★

# సంజీవ్ పెళ్ళిలో

'స్వాతి'లో మా 'మధుపెళ్ళి' అనుభవం చదివాక కొంతమంది మిత్రులు నన్ను అడుగుతూ వచ్చారు - "మీ అమ్మాయి పెళ్ళి చాలా విచిత్రంగా జరిగిందని రాశారు గదా, మరి మీ అబ్బాయి సంజీవ్ పెళ్ళిలో అలాంటి విశేషం ఏమీ జరగలేదా?" అని.

జరిగినదాంట్లో విశేషం ఉందో లేదో కాని సంజీవ్ పెళ్ళి విషయంలో జరిగింది మాత్రం ఇది:

2002 సెప్టెంబరులో అనుకున్నాం - సంజీవ్ పెళ్ళి ప్రయత్నాలు చేయాలని. అలా నిర్ణయించాక, అప్పటికే ఆసక్తి చూపుతున్న రెండు సంబంధాల జాతకాలు తెప్పించాం. అలాగే చాలాకాలంగా మాకు బాగా తెలిసున్న హరిరావుగారి కుమార్తె శ్రీలేఖ జాతకం పంపించమని ఆయన్నే అడిగాం. అలా వచ్చిన మూడు జాతకాల్నీ హైద్రాబాద్లో ఉత్తరాది మఠానికి చెందిన జ్యోతిష్కులు, నిష్ఠాగరిష్ఠులు అయిన వేదవ్యాసాచారిగారికి చూపించాం. కానీ ఆయన వాటిని విశ్లేషించకుండానే, "తిరుమలేశుడితో మీకున్న అనుబంధం దృష్ట్యా, మీరు తిరుమలకి వెళ్ళి స్వామివారికి కళ్యాణోత్సవం చేయించి, అప్పుడు ఆరంభించండి జాతకాలు చూడటం" అంటూ సలహా ఇచ్చారు. ఆ సలహా పాటించాం... శ్రీనివాసుడి కళ్యాణోత్సవం పూర్తయింది. "అబ్బాయి పెళ్ళిపనిమీద బయల్దేరుతున్నాం. ఇక నీదే భారం స్వామీ!" అనుకుని బయటకు వస్తూనే కొండమీదున్న ఉత్తరాదిమఠానికి భోజనానికి వెళ్ళాం. అక్కడ కర్నూలు నుంచి వచ్చిన పగడాల రామ్మూర్తి ఆచారిగారు తారసపడ్డారు. (ఈయన వేదవ్యాసాచారికి అన్నగారు. జ్యోతిశ్శాస్త్రంలో ఉద్దండపండితులు.) ఆయన్ని చూస్తూనే గోపికకి తన హ్యాండ్ బ్యాగ్ లో వున్న మూడు జాతకాలు తీసి ఆయనకి చూపించాలనిపించింది. "సరే కానీయ్" అన్నాను.

విచిత్రం! ఆ మూడింటిలో తాను చూసిన మొదటి జాతకాన్నే ఆయన ఆమోదించారు. ఆ జాతకం చూస్తూనే, "మీకు తెలిసున్న వాళ్ళమ్మాయే ఈ పిల్ల.

స్తోమతులగురించి ఆలోచించకుండా చేసుకోదలిస్తే, ఇది చాలా మంచి సంబంధం” అనేశారు. మిగతా రెండు జాతకాలకి ఆయన ప్రాధాన్యత ఇవ్వలేదు.

చివరికి మేం ఆ ఒక్క సంబంధమే చూడటం, శ్రీలేఖ - సంజీవ్లు (వాళ్ళకి ఊహ తెలిశాక) అప్పుడే మొదటిసారిగా మాట్లాడుకోవటం, ఈ సంబంధం అటూ ఇటూ అందరికీ నచ్చటం జరిగింది. పెళ్ళి 2002 నవంబరులో జరిగిపోయింది.

మాకు ఆనందం కలిగించిన విషయం ఏమిటంటే, హరిరావు - సుశీల దంపతులు ఆదిలాబాదు నుంచి వచ్చి తిరుపతిలో పెళ్ళి చేయటం. మా ఊహకందని విధంగా మమ్మల్ని ఆనందాతిశయంలో ముంచెత్తిన మరో విషయం ఏమిటంటే - ఈ పెళ్ళిలో ఉత్తరాదిమఠ స్వామీజీ శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ, మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం స్వామీజీ శ్రీ సమేమేంద్ర తీర్థ స్వామీజీ, పెజావర్ మఠం స్వామీజీ శ్రీ విశ్వేశతీర్థ స్వామీజీలు తమ రాకతో కళ్యాణ మంటపాన్ని పావనం చేసి, వధూవరులను ఆశీర్వదించటం.

అనేకమంది సుధా పండితులు, వేదపండితులు కూడా ఈ పెళ్ళికి విచ్చేసి, వధూవరులకు ఆశీరక్షతలు అందించారు.

“ఇలా ఏకకాలంలో ముగ్గురు స్వామీజీల ఆగమనంతో, ఇందరు పండితుల ఆశీఃపఠనంతో వివాహ వేదిక పునీతం కావటం గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇది అద్భుతం. అమోఘం” అంటూ పెళ్ళి పందిట్లో రామ్మూర్తి ఆచారిగారు విస్మయానందాలు వ్యక్తం చేశారు. మా ఆనందానికి అవధుల్లేవు! 'కళ్యాణ శ్రీనివాసుడి'కి నమస్కరించకుండా వుండలేకపోయాం...

# మా ఇతర ప్రచురణలు

| క్ర.సం | పుస్తకము పేరు | ధర |
|---|---|---|
| | **స్వామిని గురించిన పుస్తకములు** | |
| 1 | అవధూత లీల ,తెలుగు | 40 |
| 2 | అవధూత లీల, తెలుగు బైండింగ్ | 80 |
| 3 | అవధూత లీల తమిళ్ పెద్దవి | 60 |
| 4 | అవధూత లీల ఇంగ్లీషు పెద్దది | 30 |
| 5 | శ్రీ వెంకయ్య స్వామి, హింది | 5 |
| 6 | స్వామి సన్నిధి | 15 |
| 7 | అవధూత బోధామృతాము | 15 |
| 8 | చూచి నేర్చుకో | 15 |
| 9 | గురుస్తుతి | 10 |
| 10 | బాలల వెంకయ్యస్వామి | 35 |
| 11 | అవధూత లీల CD | 20 |
| 12 | శ్రీ వెంకయ్యస్వామి, eng చిన్నది | 5 |
| 13 | స్వామి కృప తమిళ్ చిన్నవి | 5 |
| 14 | స్వామి కృప తెలుగు | 5 |
| 15 | పిలిచిన పలికే దైవం | 5 |
| 16 | వెన్నెల పూలు | 5 |
| 17 | మౌన బోధ | 5 |
| 18 | బోధ యజ్ఞాయనమః | 5 |
| 19 | ధర్మ మూర్తి | 5 |
| 20 | దివ్య లీలలు | 5 |
| 21 | వాళ్ళు ఉండే దాన్ని బట్టి మన ముండేది | 5 |
| 22 | స్మృతి రహిత ప్రసన్నాయ నమః | 5 |
| 23 | స్మృతి మాత్ర ప్రసన్నాయ నమః | 5 |
| 24 | స్వామి అనుగ్రహము | 5 |
| 25 | సర్వ సమర్థుడు | 5 |
| 26 | నమ్మలేని పచ్చి సత్యాలు | 5 |
| 27 | నమ్మిన వారికి సొమ్ము నమ్మని వారికి దుమ్ము | 5 |
| 28 | శ్రీ వెంకయ్య స్వామి పూజ | 5 |
| 29 | వెంకయ్య స్వామి ఆరతులు | 10 |
| 30 | భజన | 1 |
| 31 | అసాధ్యము-సుసాధ్యము | 5 |
| | **అద్వితీయ పుస్తకము** | |
| 32 | వార్తాలాపము | 250 |

| క్ర.సం | పుస్తకము పేరు | ధర |
|---|---|---|
| | **ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గురించిన పుస్తకములు** | |
| 33 | శ్రీసాయి మాస్టర్ బోధామృతాము | 50 |
| 34 | అమృత వాక్కులు | 5 |
| 35 | మృత్యువుపై ఘనవిజయము | 5 |
| 36 | శుద్ధ చైతన్య మూర్తి | 5 |
| 37 | శ్రీ భరద్వాజ భక్తుల అనుభవాలు | 5 |
| 38 | మన ధర్మము కర్తవ్యము | 5 |
| | **సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహరాజ్ (గొలగమూడి) గురించిన పుస్తకములు** | |
| 39 | సార్ లేఖలు -1 | 15 |
| 40 | సార్ లేఖలు-2 | 25 |
| 41 | శ్రద్ధ | 5 |
| 42 | శ్రమతో సేవ-సేవతో కైవల్యం | 5 |
| 43 | పరోపకారార్ధ మిదం శరీరం | 5 |
| 44 | శ్రీ సుబ్బరామయ్య మహారాజు భక్తుల అనుభవాలు | 25 |
| | **మహనీయుల గురించి** | |
| 45 | ధునివాలా దాదా | 10 |
| 46 | సాయి కృప | 5 |
| 47 | దైవం మానుష రూపేణ (పెద్దది( | 60 |
| 48 | దైవం మానుష రూపేణ(దర్గా స్వామి) | 5 |
| 49 | యర్ర దుర్గా స్వామి | 5 |
| 50 | రంగన్న బాబు | 10 |
| 51 | నల్ల మస్తాన్ బాబా | 5 |
| 52 | అవధూతేంద్ర స్వామి | 5 |
| 53 | నరోపా జీవితం చరిత్ర | 5 |
| 54 | పూండి స్వామి | 5 |
| 55 | నాంపల్లి బాబా (హైదరాబాద్) | 10 |
| 56 | మాయి అమ్మ (సేలం) | 5 |
| 57 | శివనేశన్ స్వామి (షిర్డి) | 10 |
| 58 | శివుని ఆజ్ఞ (శ్రీ వెంకటేశ్వర స్వామి) | 10 |
| 59 | కంచి పరమాచార్య | 30 |
| 60 | సుధీంద్ర బాబు | 5 |
| 61 | నామ కోటి(ఓం నారాయణ, ఆది నారాయణ) | 20 |